ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
26 జూన్, 2011

ENTERED

నెత్తు'రోడ్డు'తోంది !

హ్యాపీ బర్త్‌డే

(2011 జూన్ 26 నుంచి
2011 జులై 2 వరకు)

ఎన్. యశ్వంత్
1సం॥, జూన్-2010
భాగ్యలక్ష్మి-గురుబ్రహ్మం
పాములూరు-ప్రకాశం

కె. తేజస్విని
జూన్
రోహిణి-రవికుమార్
రాజమండ్రి

కె.చందనసాన్వి
2సం॥, జులై-1
రేణుక-లచ్చయ్య
గజ్వేల్-మెదక్

డి.సాయితేజ
8సం॥, జూన్-26
సైదమ్మ-వీరయ్య
ఓగోడు-నల్లగొండ

పి.నాగసుధ
4సం॥, జూన్-26
తిరుపతమ్మ-మాధవరావు
జుజ్జురు-కృష్ణా

పి. తేజస్విని
4సం॥, జూన్-26
రమణ-వెంకటేశ్వర్లు
మార్కాపురం-ప్రకాశం

ఆర్.శ్రీవల్లి
2సం॥,జులై-1
స్రవంతి-శ్రీనివాస్
కానూరు-విజయవాడ

ఎం.మనోజ్‌కుమార్
జూన్
గోవిందమ్మ-గోపి
సుందరయ్యనగర్-ఖమ్మం

బి.మేఘన
9సం॥, జూన్-2002
శాంతి-వెంకటేశ్వర్లు
జాబ్లిపుర-ఖమ్మం

బి.సాయికుమార్
8సం॥, జూన్-28
మంగలక్ష్మి-సత్తిబాబు

భావన
9సం॥, జూన్-26
మాలతి-మల్లిఖార్జున్
సదాశివపేట-మెదక్

కె.రాజు-లేయ
1సం॥-5సం॥, జూన్-1
అరుణ-బెల్తాజర్
కోవెలకుంట-కర్నూలు

ఎం.సాయి జశ్విత
3సం॥, జూన్-23
విజయ్‌కుమారి-మల్లిఖార్జునాచారి
నేరేడ్‌మెట్-హైదరాబాద్

ENTERED

మనలో మాట

బాబా 'అంతరంగిక' సందేశం



మీరు పుష్పక విమానం సినిమా చూశారా? దాన్లో పిఎల్ నారాయణ భిక్షగాడు. నూకలు చెల్లిపోయి, ఒకరోజు చనిపోతాడు. మున్సిపాలిటీ వాళ్లు శవాన్ని తీసుకెళ్లడానికి వస్తారు. శవాన్ని ఎత్తగానే కిందనున్న గోనె సంచి గాలికి లేచిపోతుంది. దానికింద పెద్ద సంఖ్యలో వున్న కరెన్సీ నోట్లు గాల్లో ఎగురుతాయి. అతడు జీవితాంతం ముష్టెత్తి పోగేసిన డబ్బు అది. మున్సిపాలిటీవాళ్లు శవాన్ని అక్కడే పడేసి, ఎగురుతున్న రూపాయి నోట్ల వెంట పడతారు! తాము రోజూ గమనిస్తుండే భిక్షగాడు చనిపోయాడా... అయ్యో పాపం అంటూ విచారం వ్యక్తం చేస్తున్న జనం కూడా నోట్ల వెంట పరుగెత్తుతారు. అనాథ శవం అనాథగానే మిగిలిపోతుంది. లోకం రూపాయల వెంట పరుగులు తీస్తుంది. డబ్బు పవరేంటో సింగీతం చక్కగా చిత్రీకరించారు.

ఆ పవరే ప్రశాంతి నిలయాన్ని అందలమెక్కించింది. ఆనక వివాదాల వలయంగా మార్చింది. మనీ మేక్స్ మెనీ థింగ్స్. బాబా బెడ్ మీద ఉండగానే బ్యాక్‌డ్రాప్‌లో- అందిన కాడికి నొక్కేసే అధమ స్థాయి మంత్రాంగం నడిచినట్లు పుంఖానుపుంఖాలుగా వార్తలొచ్చాయి. అది నిజమే అన్నట్టుగా తాజా తరలింపులూ రుజువు చేస్తున్నాయి. ప్రశాంతి నిలయంలో యజుర్మందిరం ఒక భవనం. అది బాబా నివాసం. యజుర్వేదం స్ఫూర్తితో ఆ మందిరానికి ఆ పేరు పెట్టారని భావిస్తే పప్పులో కాలేసినట్లే. యజ్ఞవేదిక ఎత్తూ పొడుగూ దానిపైన వుంచవలసిన ధాన్యాలూ, ఏ పురోహితుడు ఎక్కడ కూర్చుని యజ్ఞం చేయాలి మొదలైన కర్మకాండను వివరించేది యజుర్వేదం. యజుర్మందిరం దీనికి పూర్తి భిన్నం. ఇక్కడ ధాన్యాలుండవు. ధనకనక రాసులుంటాయి. అంతరంగికులకు తప్ప అన్యులకు చివరికి ధర్మకర్తలకు కూడా ఇందులోకి ప్రవేశం లేదు. ఎందుకో ఇప్పుడు తెలిసిపోయింది.

బాబా బసలో ఏ దివ్య ప్రవచనాలో, ఏ భవితవ్య నిర్దేశనాలో దొరకలేదు. కళ్లు జిగేల్‌మనే కోట్లూ, కేజీల కొద్దీ బంగారమూ దొరికాయి. అక్కడ ఉంచిందెంత! లెక్కల్లో చూపించిందెంత...? సామాన్యుల సంశయాల సంగతి ఎలా వున్నా, బాబా బంధువుల ప్రశ్నలు మాత్రం పరిశీలించవలసిందే. బాబా అస్వస్థులు కాగానే ధర్మకర్తలే ధనం కాజేశారని బాబా బంధువుల బహిరంగ వ్యాఖ్యలు. లెక్కా పత్రం లేని డబ్బు మరి. ఏమైనా కావచ్చు. ఏలాగైనా తరలెళ్లవచ్చు. సినిమాల్లో హీరో చచ్చీ చెడీ ఒంటిచేత్తో వందమందిని చితక బాదిన తర్వాత గాల్లోకి కాల్పులు జరుపుతూ సీన్లోకి ప్రవేశించే పోలీసుల్లాగా జరగాల్సిందల్లా జరిగాక ఏమౌతోందిక్కడ అంటూ మన సర్కార్ వారు సీన్‌లోకి ప్రవేశించారు. సమగ్ర నివేదిక పంపాలని హుకుం జారీ చేశారు. ఏమౌతుందో...వేచి చూడాల్సిందే.

ఏదైతేనేం ఒక విషయం మాత్రం ఇక్కడ తేలిపోయింది. జీవితాంతం బాబా ఏమి చెప్పినా- ఆయన జీవిత 'అంతం' మాత్రం నిత్య నిరూపణకు నిలిచే సత్యాన్నే చాటి చెప్పింది. 'మహిమాన్విత' స్వాములైనా జబ్బు బారిన పడతారని, మంత్రతంత్రాలు నమ్ముకోక మందులే వాడతారని, బతకటం అనేది వాళ్ల చేతిలో లేని పనని చాలా స్పష్టంగా నిరూపించింది. ఎంతోకాలంగా విజ్ఞానవేత్తలూ, శాస్త్రీయ దృక్పథం గలవారు చెబుతున్న వాస్తవాన్నే- సత్యసాయి మరణ ప్రబోధం ద్వారా తన భక్తులకు అంతిమ సందేశం అందించారు.. ఆ సందేశం మరింత బాగా అర్థం చేసుకోవటానికి బాబా అంతరంగిక బృందం ఆధిపత్య విన్యాసాలూ, కైంకర్య సాహసాలూ నిస్సందేహంగా దోహదపడతాయి.

★

ఈ సంచికలో....

టపా	...	2
పాత బంగారం	...	4
ఈ పేజ్	...	5
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
రుచి	...	11
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
వికాసం	...	20
కొత్త పుస్తకాలు	...	21
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

సినిమా కబుర్లు ... 8

దక్షిణాది కథలకు ఉత్తరాన క్రేజు



పాలరాతి పుష్పం ... 10

కథ ... 18

పాపమ్మ



ఆకర్షించిన తాజ్...

ఈ వారం 'చూద్దామా'లో అందించిన ఆహ్లాదం... ఆగ్రా ప్రయాణం విశేషాలు ఆకర్షించాయి. ప్రపంచ అద్భుతాల్లో ఒకటైన తాజ్ మహల్ చూడడం కన్నుల పండుగే. ఆగ్రాలో టాంగాల ప్రాముఖ్యత, ముఖ్యమైన మూడు రైల్వే స్టేషన్ల ప్రస్తావన కూడా చేరిస్తే బాగుండేది.

నూతి నారాయణ రావు,
గద్దిఅన్నారం.

ఎదిగే పిల్లల పౌష్టికాహారం

పిల్లలకు ప్రతి రోజూ ఏయే పదార్థాలు ఎన్నెన్ని గ్రాములు అందించాలో అట్టమీద కథ ద్వారా తెలియజేశారు. ఎదిగే వయసులో పిల్లలకు పౌష్టికాహారం ఎంత ముఖ్యమో తెలిసింది. ఈ వ్యాసం ప్రచురించినందుకు స్నేహకు అభినందనలు.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

ఎవరి గోల...

'బుజ్జి బొజ్జకు' ఏమేమి కావాలో, ఎటువంటి పదార్థాలు అందిస్తే వారి శారీరక, మానసిక ఎదుగుదలకు ఉపయోగకరంగా ఉంటుందో వివరించారు. ఈ వ్యాసరచయితకు అభినందనలు. తెలుగు చిత్రాలు తమిళనాట విజయభేరి మోగించడం ఆనందదాయకమే. కళకు భాషాభేదం లేదంటారు. కథలకు కూడా భాషాభేదం లేదు. మామూలు భిక్షగాళ్లు కడుపు నింపుకోడానికి ముష్టెత్తుకుంటే, రాజకీయ నాయకులు దేశాన్ని దోచుకోడానికి ఓట్లు ముష్టెత్తుకుంటారు. ఎవరి గోల వాళ్లది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

ప్రతి ఒక్కరూ చదవాలి

ఈ వారం స్నేహ అట్టమీది కథలో సంపూర్ణ ఆరోగ్యానికి అవసరమైన విషయ సరంజామా అందింది. ద్రోణాదుల వెంకటేశ్వర్లు అందించిన 'జీవఫలం చేదువిషం' కథ బాగుంది. 'వికాసం' శీర్షిక ఆదర్శవంతంగా వుంటోంది. నేడు సెల్ వాడని వాళ్లు చూద్దామన్నా కనిపించడం లేదు. అందుకే 'ఈ పేజ్'లో కె.ఎక్స్.రాజు అందించిన సెల్ రేడియేషన్ తగ్గించుకునే మార్గాలు ప్రతి ఒక్కరూ చదవాల్సిన వ్యాసం. 'రాజ్యం లేని రాజు' కవిత బాగుంది. మిగతా కవితలు భావగర్భితంగా ఉన్నాయి. తెలుగు, తమిళరంగ చిత్ర విశేషాలతో 'సినిమా కబుర్లు' ఆకట్టుకున్నాయి. తారల సొట్టబుగ్గల రహస్యాలు తెలుసుకున్నాం. 'చూద్దామా'లో తాజ్‌మహల్ అందాలు, పరిసర ప్రాంతాల సోయగాలు ఆకట్టుకున్నాయి. 'ఓ ఐడియా...' చిత్రాలు కనువిందు చేశాయి. 'మనలో మాట' వాస్తవాలను ప్రతిబింబిస్తోంది.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

ఎలా పాటించాలో...

నేటి యువత సెల్‌లో గంటలు గంటలు మాట్లాడుతోంది. దానివల్ల వచ్చే ప్రమాదాలు ఇప్పుడేమీ కనిపించకపోయినా ముందుముందు ఎలాంటి నష్టం వాటిల్లుతుందో తెలీదు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటూ వాటిని వాడుకుంటే బాగుంటుంది. బుజ్జాయిల బొజ్జకు ఎంత ఆహారం ఇవ్వాలో, ఏమేమి ఇవ్వాలో 'బుజ్జి బొజ్జకు' వ్యాసం ద్వారా అందించడం సంతోషంగా ఉంది. పిల్లలకు నాయకత్వ లక్షణాలు చిన్నప్పటి నుండే నేర్పించాలని చెప్పడమే కాకుండా అవి ఎలా పాటించాలో కూడా సూచనలిచ్చారు.

యాదగిరి, వరంగల్.

రాజాకి పట్టిన గతే...

జీవఫలం చేదువిషం కథ బాగుంది. 'సొట్ట బుగ్గల సోయగం'లో సొట్ట బుగ్గలు ఎలా వస్తాయో, వాటిని కృత్రిమంగా ఎలా ఏర్పాటు చేస్తారో చక్కగా వివరించారు. అరవైనాలుగు కళల్లో ముష్టి కూడా ఒక కళేనట. అందులో మన రాజకీయ నాయకులు పండిపోయారు. గాలి సోదరులు అక్రమంగా సంపాదించిన ఆస్తిపాస్తుల లెక్కలు ఎవరికీ తెలీదు. ఎంత సంపాదించినా చివరకు 2జీ రాజాకి పట్టిన గతే వారికీ పడుతుంది. కాకపోతే కాస్త అటూ ఇటుగా. అంతే తేడా.

మమత, గుంటూరు.

ఎంపిక బాగుంది

'రాజ్యం లేని రాజా, అమ్మ, యాంత్రిక జీవనం' కవితలు భిన్నమైన కోణాల్లో, లోతైన భావనతో దేనికదే పాఠకుల మేధను తడుతున్నాయి. కథలు, కవితలు, ఇతర రచనల ఎంపిక బాగుంటోంది. స్నేహని ఇంతగా తీర్చిదిద్దుతూ పాఠకులను రంజింపజేస్తోన్న రచయితలకు, సంపాదకవర్గానికి ధన్యవాదాలు.

తోట సదానందం, మంచిర్యాల.





SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ **ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:**

CHENNAI:
0-9789099589

హలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE ™

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

.... Pin Code: ______

ప్రత్యక్షశిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside: Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near: Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex, D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239, 99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709, 92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

పాత బంగారం

'ఇద్దరు మిత్రులు' స్వర్ణోత్సవం

ఒకే నటుడు ఒకే సినిమాలో రెండు పాత్రలు పోషిస్తే... ద్విపాత్రాభినయం అవుతుంది. అచ్చం ఒకేలా వుండే ఇద్దరు హీరోలు, హీరోయిన్లు... క్యారెక్టర్ ఆర్టిస్టులు...ఒకరికి తెలియకుండా ఒకరు కథను నడిపిస్తుంటారు. పాత్రధారుల మధ్య జరిగే ఆసక్తికర సంఘటనలు ప్రేక్షకులను అలరిస్తుంటాయి. అయితే అలాంటి అద్భుత చిత్రం 'ఇద్దరు మిత్రులు'. సరిగ్గా యాభయ్యేళ్లకిందట అక్కినేని నాగేశ్వరరావు ద్విపాత్రాభినయంతో వెలువడిన చిత్రమిది. ఆ విశేషాలేంటో తెలుసుకుందామా!

అక్కినేని ద్విపాత్రాభినయంతో వచ్చిన తెలుగు సినిమా 'ఇద్దరు మిత్రులు'. ఇది 1961లో విడుదలయింది. ఒక మనిషిని పోలిన మరో మనిషి... ఒకడు ఆగర్భ శ్రీమంతుడు... మరొకడు దిగువ మధ్యతరగతివాడు. ఎంత చెట్టుకంత గాలి. కలిమితో వచ్చే సమస్య ఒకరిదైతే లేమితో తలెత్తే సమస్య మరొకరిది. జమిందార్ గారి మరణంతో విదేశాలలో చదువుకుంటున్న అజయ్ స్వదేశానికి తిరిగి వస్తాడు. దివాన్ కమీషన్లకు ఆశపడి జమిందార్‌ని అప్పులపాలు చేస్తాడు. ఆ సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉంటాడు అజయ్. అతని రూపంలో ఉన్న విజయ్ నిరుద్యోగి. నిరాశ, నిస్పృహలతో అలమటిస్తూ తాగి వస్తున్న అజయ్ కారుకింద పడబోతాడు. అజయ్ తన రూపంలో ఉన్న విజయ్‌ని చూసి విస్తుపోతాడు. వారి సమస్యలను చర్చించుకుంటారు. ఒకరి సమస్య మరొకరికి తేలికగా కనిపిస్తుంది. పరస్పర అంగీకారంతో ఒకరి స్థానంలో మరొకరు చేరతారు. కానీ అజయ్ గుడ్డి మేనత్త ఈ మార్పుని పసిగడుతుంది. మిత్రులిద్దరు కలిసి తమ ఒప్పందాన్ని ఆమెకు తెలియజేస్తారు. విజయ్ బాధలు ఏమిటంటే తండ్రి బాధ్యతారహితమైన వ్యక్తి. కుటుంబ పోషణ పట్టించుకోడు. రామభజన చేస్తూ డబ్బు చేతిలో ఆడితే రామార్పణం చేస్తూ ఉంటాడు. చేసిన అప్పు తీర్చనందుకు జైలుకు వెళ్లాల్సి వస్తే, కూతురు మీనాకి ఆమె అత్తగారు పెట్టిన నగలు తాకట్టుపెట్టి చక్రం అడ్డువేస్తాడు. ఆ నగలు తెచ్చేదాకా మీనాను కాపురానికి తీసుకెళ్లనని భీష్మించుకుని కూర్చుంటాడు మీనా మామగారు వీరభద్రయ్య. కోడలు కాపురానికి రావాలని ఉంటుంది మీనా అత్తగారికి. కానీ భర్తకు ఎదురు చెప్పలేని అశక్తురాలు. తల్లి ప్రోద్బలంతో మీనా భర్త, తండ్రికి తెలియకుండా మీనా దగ్గరకి వస్తూపోతూ ఉంటాడు. దివాన్ ఆశను గమనించి అతని కూతురితో చెలిమి చేస్తాడు విజయ్.... మేనత్త హెచ్చరిస్తుంది. హద్దులు మీరకుండా, మేనత్త సలహా సంప్రదింపులతో ఇంటిలో విశ్వాసపరులైన నౌకర్ల సాయంతో దివాన్ ఆటకట్టిస్తాడు విజయ్. ఈ విధంగా శ్రీమంతుని సమస్యను మధ్యతరగతి వాడు పరిష్కరిస్తే, మీనా మామగారికి బుద్ధిచెప్పి, సమస్యలను ఒక కొలిక్కి తెస్తాడు అజయ్. మధ్య తరగతి వాని సమస్యను శ్రీమంతుడు పరిష్కరిస్తాడు. ఒకే పోలికలున్న రెండు పాత్రలను కథానాయకుడు అక్కినేని నాగేశ్వరరావు పోషించారు. అజయ్ దివాన్‌గా గుమ్మడి, మేనత్తగా జి. వరలక్ష్మి తండ్రిగా రమణారెడ్డి, చెల్లెలు మీనాగా శారద, ఆమె భర్తగా పద్మనాభం, అతని తల్లిదండ్రులుగా రేలంగి, సూర్యకాంతం, కథానాయకుని జోడీలుగా రాజసులోచన, ఇ.వి. సరోజ నటించారు.

ఈ చిత్ర సంగీత దర్శకులు సాలూరి రాజేశ్వరరావు వీనుల విందైన పాటలు "పాడవేల రాధికా...., ఖుషీఖుషీగా నవ్వుతూ..., ఒహో ఒహో అమ్మాయీ..., ఈ ముసిముసి నవ్వులు..., ఒహో ఒహో నిన్నే కోరితి...., శ్రీరామ నీనామమెంతో రుచిరా..., చక్కని చుక్కా సరసకు రావే,..." వంటి పాటలు తెలుగు వారిని ఐదు దశాబ్దాలుగా అలరిస్తూనే ఉన్నాయి. హాస్య నటుడు పద్మనాభం, శారద మీద చిత్రీకరించిన "చక్కని చుక్క సరసకు రావే..." పాటలో యమకాలు, శబ్దాలంకారాలు బోల్డు... "చక్కని చుక్క సరసకు రావే ఒక్కసారి నవ్వినా చాలే ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నానే... టక్కరి బావా కిక్కురుమనకు ఇక్కడి మాటలు ఇతరులు వింటే ఉక్కిరి బిక్కిరి అయిపోతావే... అల్లరి పిల్లా ఆపవేలా పుల్లవిరుపుడు మాటలు పెళ్లాం కనిపిస్తే ప్రేమ కలిగిందా... సూటిగ పెళ్లాడి... దాటుగ రాసేల నాయనగారి మీసం చూస్తేనే సన్యాసం... పెద్దలు గర్జిస్తే పెడసరమవుతావా... అబ్బా అబ్బబ్బా నీమాటలు కొరడా దెబ్బలు... చేయకు నన్ను దూరము తీయకుమీ నా ప్రాణమూ... తీయకు మీ...నా ప్రాణం..." ఈ మాటలన్నీ గిలిగింతలు పెట్టే చమక్కులే మరి...

దుక్కిపాటి మధుసూదనరావు గారు అన్నపూర్ణ పిక్చర్స్ సంస్థను స్థాపించి కె.వి.రెడ్డి గారి దర్శకత్వంలో 'దొంగరాముడు' చిత్రంతో సినిమా నిర్మాణాన్ని ప్రారంభించారు. అటు పిమ్మట ఆదుర్తి సుబ్బారావు గారి దర్శకత్వంలో 'తోడికోడళ్లు, మాంగల్యబలం, వెలుగునీడలు, చదువుకున్న అమ్మాయిలు' చిత్రాలను నిర్మించారు. మంచికథ ఎక్కడున్నా వెతికి పట్టుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య... మంచి కథాచిత్రాలకు కేరాఫ్ అడ్రస్ అన్నపూర్ణా వారి చిత్రాలు. ఆదుర్తి సుబ్బారావు గారి దర్శకత్వంలోనే 'ఇద్దరు మిత్రులు' సినిమా నిర్మించారు. నవలలను తెలుగు తెరకెక్కించిన ఘనత ఆయనదే. తర్వాత కాలంలో మంచి ఆదరణ పొందిన అరికెపూడి (కోడూరి కౌసల్యాదేవి) గారి నవల చక్రభ్రమణం ఆధారంగా డాక్టర్ చక్రవర్తి సినిమాను నిర్మించారు. ఆ చిత్రానికి దర్శకులు ఆదుర్తి సుబ్బారావు గారే.

'ఇద్దరు మిత్రులు' చిత్రం తర్వాత ద్విపాత్రాభినయంతో, త్రిపాత్రాభినయంతో బహుపాత్రాభినయంతో తెలుగులో చాలా సినిమాలు వచ్చాయి. 'రాముడు భీముడు' సినిమా కోవలో తెలుగులోనే కాదు హిందీలో కూడా చిత్రాలు వచ్చాయి. ప్రముఖ హిందీ బాక్సాఫీస్ జంట కవులు సలీం జావేద్ రచించిన జి.పి.సిప్పీ సూపర్ డూపర్ హిట్ 'సీతా ఔర్ గీతా' చిత్రానికి 'రాముడు భీముడు' మాతృకగా పేర్కొనవచ్చు. చిరంజీవి హీరోగా వచ్చిన 'రౌడీ అల్లుడు' చిత్రం కూడా ఈ కోవలోనిదే. కానీ ఇద్దరు మిత్రులు చిత్రం కోవలో చిత్రాలు రాలేదు. ఇందులో ఇద్దరూ తెలివైన వారే. కానీ ఎవరి సమస్యలు వారు పరిష్కరించుకోలేకపోతారు. కానీ ఇతరుల సమస్యలు పరిష్కరించగలరు. కారణం మన వారితో వ్యవహరించవలసి వచ్చినప్పుడు సున్నితత్వం అడ్డు వస్తుంది. కానీ ఇతరుల విషయానికి వస్తే నిష్కర్షగా వ్యవహరిస్తాం. అందుకు ఉదాహరణ దివాన్ విషయంలో అజయ్‌కి, తండ్రి విషయంలోనూ, చెల్లి విషయంలోనూ విజయ్‌కి, అదే విధంగా విజయ్ సంబంధీకుల విషయంలో అజయ్‌కి అడ్డు రాలేదు. అదీ నాకు ఈ సినిమాలో తోచిన ప్రత్యేకత.


దుక్కిపాటి మధుసూదనరావు


ఆదుర్తి సుబ్బారావు

కొత్త పోకడలతో మంచి చిత్రాన్ని నిర్మించి విజయం సాధించారు దర్శక నిర్మాతలు ఆదుర్తి, దుక్కిపాటి... ఈ ఇద్దరిదీ చాలా విజయవంతమైన జంట అనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

- కోటమర్తి మణి

ఆ ముగ్గురు...



సమాచార సాంకేతిక రంగం నేడు ఎంతగానో ఎదిగింది. ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్ల వినియోగం భారీగా పెరిగింది. ఇందుకు రెండు ముఖ్యమైన పరిశోధనలే కారణం. ప్రారంభదశలో మెకానికల్ పరికరాలతో గణాంక యంత్రాలు తయారుచేయబడగా, తరువాత కాలంలో వ్యాక్యూమ్ ట్యూబులు, ట్రాన్సిస్టర్లను ఉపయోగించ సాగారు. గతంలో కంప్యూటర్లు పెద్దపెద్ద గదులను ఆక్రమించేవి. కిలోవాట్లకొద్ది విద్యుత్‌ని ఖర్చు చేసేవి. ఆ స్థాయి నుంచి డెస్క్‌టాప్‌లు, పామ్‌టాప్‌ల రూపానికి మారడానికి వీలు కల్పించింది 'ఇంటిగ్రేటెడ్ చిప్'.

ఇంటిగ్రేటెడ్ చిప్ (ఐసి) ఆవిర్భవించి వుండకపోతే మనలో చాలామందికి అసలు కంప్యూటర్‌ని చూసే అవకాశమే వుండేది కాదు. నేడు ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్లు ఇంటర్నెట్ ఆప్టికల్ ఫైబర్ల ద్వారా, మొబైల్ పరికరాలు వైర్‌లెస్, రేడియో, శాటిలైట్ లింక్‌ల ద్వారా ఒకదానితో మరొకటి సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకొంటున్నాయి. ఒక కంప్యూటర్ నుంచి మరొక కంప్యూటర్‌కి లేదా ఒక పరికరం నుండి వేరొక పరికరానికి ఇంత డేటాను సమర్థవంతంగా పంపించగలగడానికి చేసిన పరిశోధనలే కంప్యూటర్ల వినియోగం పెరగడానికి మరో ముఖ్యకారణం. ఈవిధంగా వేగవంతమైన డేటా ట్రాన్స్‌మిషన్‌కి వీలు కలిగించిన పరిశోధన సెమీ కండక్టర్ హెటెరోస్ట్రక్చర్స్ (Semi Conductor Heterostructures). ఈ రెండు టెక్నాలజీలపై పరిశోధనలు జరిపి చక్కటి ఫలితాలను మనకు అందించిన ఆ ముగ్గురు శాస్త్రవేత్తలకు 2000 సంవత్సరానికి గాను 'నోబెల్ బహుమతి' కూడా లభించింది. వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు అందించిన విశిష్ట వ్యక్తులకు ప్రకటించే ఈ బహుమతిని ఐటీ రంగంలో అనేక పరిశోధనలు చేసి 'ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్' పరిశోధనలో కృషి చేసినందుకు జాక్ ఎస్.కిల్బై కి... వేగవంతమైన కమ్యూనికేషన్, ఆప్టో ఎలక్ట్రానిక్స్‌లో ఉపయోగించే సెమీ కండక్టర్ హెటెరోస్ట్రక్చర్స్ టెక్నాలజీని కనుగొన్నందుకు జోర్స్ ఐ.ఆల్‌ఫెరోవ్, హెర్బర్ట్ క్రోమర్ లకూ సంయుక్తంగా ప్రకటించారు.

నేటి ఆధునిక టెక్నాలజీ రంగం అంతా ఇంటిగ్రేటెడ్ చిప్‌పైనే ఆధారపడి ఉంది. ఎంతో శక్తివంతమైన కంప్యూటర్లు, ప్రోసెసర్ల నుంచి వాషింగ్‌మెషీన్లు, కార్లు, మెడికల్ పరికరాలు, టీవీలు, మొబైల్ ఫోన్లు, వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు వంటి అన్ని రంగాలలోనూ ఐసిలను ఉపయోగిస్తున్నారు.

20వ శతాబ్దపు తొలి అర్థభాగంలో ఎలక్ట్రానిక్ పరిశ్రమ పూర్తిగా వ్యాక్యూమ్ ట్యూబ్‌లపైనే ఆధారపడివుంది. ఇది ఎక్కువ సైజుని కలిగివుండడం, సమర్థవంతంగా పనిచేయకపోవడం, త్వరగా పాడైపోవడం, విద్యుత్‌ని ఎక్కువగా ఉపయోగించుకోవడం, అధికంగా వేడిని ఉత్పత్తి చేయడం వంటి సమస్యల వల్ల ఇబ్బందులు ఎదురయ్యేవి. 1947లో బెల్ లాబొరేటరీస్ వారు ట్రాన్సిస్టర్‌ని కనుక్కోవడంతో ఈ సమస్య దాదాపు పరిష్కారమైంది. వ్యాక్యూమ్ ట్యూబ్‌లతో పోల్చితే ఈ ట్రాన్సిస్టర్లు చిన్నవిగా వుండడం, ఎక్కువకాలం పనిచేయడం, సమర్థవంతంగా పనిచేయడం, తక్కువ పవర్‌ని వినియోగించుకోవడం, తక్కువ వేడిని ఉత్పత్తి చేయడం వల్ల అన్ని రకాల ఎలక్ట్రానిక్ పరికరాలలోనూ ఈ ట్రాన్సిస్టర్లను ఉపయోగించడం ప్రారంభమైంది. కొన్ని వందల, వేల ట్రాన్సిస్టర్లు, డయోడ్‌లు, రెసిస్టర్లు, కెపాసిటర్లు మొదలైన వాటిని ఉపయోగించి ఎంతో క్లిష్టమైన ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌లను తయారుచేయడం ప్రారంభమైంది. అయితే దీనివల్ల కూడా సమస్యలు పూర్తిగా తొలగిపోలేదు. ఆయా కాంపొనెంట్లు వేర్వేరు సైజులను కలిగివుండడం, కొన్నివేల కాంపొనెంట్‌లను ఒకదానితో ఒకటి కలిపి షోల్డరింగ్ చేయవలసి రావడం పెద్ద సమస్యగా మారింది. ఇంత అధిక సంఖ్యలో కాంపొనెంట్లను షోల్డరింగ్ చేయడానికి ఎంతో సమయం వృధా కావడమేకాక ఖర్చు కూడా ఎక్కువగానే వుండేది. అంతేకాకుండా ఇవి బాగా వేడెక్కినప్పుడు ఈ షోల్డరింగ్ చేసిన జాయింట్లు ఊడిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యేవి. ఈ నేపథ్యంలో ఏ సమస్యలూ లేకుండా, తక్కువ ధరతో సమర్థవంతంగా పనిచేసేవిధంగా, జాయింట్ చేయగల టెక్నాలజీ కోసం అన్వేషణ ప్రారంభమైంది.

1958 సెప్టెంబర్ 12న తన కలల ప్రతిరూపాన్ని కిల్బై ప్రదర్శించి చూపాడు. ఒక చిన్న (7/16×1/16 అంగుళాలు) గాజు పలకపై జెర్మేనియం ముక్క అతికించబడి, వైర్లు బయటకు వేలాడుతూ ప్రదర్శించబడిన ఈ పరికరం ప్రపంచగతిని మారుస్తుందని ఎవరూ ఊహించలేదు. ఆ చిన్న జెర్మేనియం వలన ఒక ట్రాన్సిస్టర్, మరికొన్ని కాంపొనెంట్‌లను కలిగిన సర్క్యూట్ రీప్లేస్ చేయడానికి ఉపయోగించవచ్చని ప్రయోగాత్మకంగా నిరూపించాడు. ఇది ప్రపంచ ఎలక్ట్రానిక్ రంగాన్ని మలుపుతిప్పి, నేటి ఐటీ విప్లవానికి బాటలు వేసిన సంఘటన అని చెప్పవచ్చు. అనేక పరిశోధనలు చేసిన కిల్బై సుమారు 60 టెక్నాలజీలకు పేటెంట్ కలిగివున్నారు. దేశవిదేశాల్లో అనేక అవార్డులు పొందిన ఆయన ఆలోచనే ఐటీరంగానికి పునాది.

జోర్స్ ఐ.ఆల్‌ఫెరోవ్, హెర్బర్ట్ క్రోమర్ లు సెమికండక్టర్ స్ట్రక్చర్‌లపై ఆధారపడి పనిచేసే వేగవంతమైన ఆప్టికల్ మరియు మైక్రో ఎలక్ట్రానిక్ కాంపొనెంట్‌లను కనుగొన్నారు. హెటెరోస్ట్రక్చర్ (Heterostructure) గా పిలవబడే ఈ టెక్నాలజీ ఆధారంగా తయారుచేయబడిన ట్రాన్సిస్టర్లను రేడియోలింక్ ఉపగ్రహాలలోను, మొబైల్ ఫోన్స్ బేస్ స్టేషన్లలోనూ ఉపయోగిస్తారు. ఇదే టెక్నాలజీ ఆధారంగా తయారుచేయబడే లేజర్ డయోడ్‌లే నేటి ఆప్టికల్ కేబుల్స్ ద్వారా ఇంటర్నెట్ సమాచారం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వేగంగా పంపిణీచేయడానికి ఉపయోగపడుతున్నాయి.

జోర్స్ ఐ.ఆల్‌ఫెరోవ్ 1962 నుంచి సెమీకండక్టర్ హెటెరోస్ట్రక్చర్స్‌పై పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా '3-5 సెమి కండక్టర్ హెటెరోస్ట్రక్చర్స్'లో ఈయన చేసిన పరిశోధనలు లేజర్ తయారీ, ఎల్.ఇ.డి.లు, నేటి అధునాతన హెటెరోస్ట్రక్చర్‌లలో వినియోగించబడుతున్నాయి. అనేక ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్న ఆల్‌ఫెరోవ్ సెమీకండక్టర్ టెక్నాలజీలో సుమారు 50 పరిశోధనలు చేయడంతోపాటు 4పుస్తకాలు, 400వ్యాసాలు రాసారు.

ప్రొఫెసర్ హెర్బర్ట్ క్రోమర్ 1952లో అప్పట్లో ఎంతో అధునాతన పరికరాలైన ట్రాన్సిస్టర్లలో హాట్ ఎలక్ట్రాన్ ఎఫెక్ట్స్‌పై పరిశోధనకుగాను యూనివర్సిటీ ఆఫ్ గాటింగాన్ నుంచి పిహెచ్‌డి పొందారు. క్రోమర్ పరిశోధనలు తొలినాళ్ళ నుండి రెండు దశాబ్దాల తర్వాత రానున్న టెక్నాలజీలపైనే కొనసాగించారు. 1950 దశకంలోనే నేడు హెటెరోస్ట్రక్చర్స్‌గా పిలువబడుతున్న టెక్నాలజీ సాయంతో సెమీ కండక్టర్ పనితనాన్ని పెంచవచ్చని కనుగొన్నారు. 1963లో ఈయన ప్రతిపాదించిన "డబుల్ హెటెరోస్ట్రక్చర్ లేజర్' నేటి అన్ని రకాల లేజర్ కమ్యూనికేషన్‌కూ తొలిమెట్టు.

ఆ ముగ్గురు అసమాన మేధావుల కృషి ఫలితంగా ఏర్పడిన పునాది నేటి అధునాతన సాంకేతికతకు, ఐటీరంగ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేసింది. ★

హంపి కవితలు

కొండల్ని కదిలించి
కండల్ని కరిగించి
నిర్మించారీ రాజధానిని
ఆనెగొందికి ఆమడదూరంలో
చరిత్రకు నమస్కారం

తుంగభద్ర
హంపికి వెన్నెముక
రాళ్లు రత్నాలయ్యింది
ఇందులో మునిగే!
చట్టూ ఉన్న పచ్చని తోటలకు
స్తన్యమిస్తున్న తల్లి
నది కాదిది పాలవెల్లి

ఎర్రెర్రని గోపురాల మీద
తలలు తెగిన శరీరాలు
ఐనా నిటారుగానే ధీరులు!
ఇవి వొట్టి గోపురాలా
విజయనగర విజయ పతాకాలు
వీరుల రక్తకేతనాలు!

ఒకనాడీ నేలమీద
పరుగులు పెట్టిన కరిరాజులు
ఇప్పుడు శిలలమీద ఘీంకరిస్తున్నారు
అరుణ గంభీరంగా గజశాలలు
అల్లసాని పెద్దనను
ఊరేగించిన అంబారీది ఏ గదో?
తొండాలు ఎంత సాగినా
పై కప్పు లతలు అందవు
పూలూ తీగల తోనా
ఏనుగులకు కాలక్షేపం!



ఏ శిల్పి మనోరథమో
ఈ రాతిరథం!
శతాబ్దాలుగా ఎండలో వానలో
తాను కదలకుండా
ప్రపంచాన్ని చుట్టూ తిప్పకుంటున్న
ఆకర్షణ
సరదాకొద్దీ ఓ ఫొటో
ఛాయనిండా హంపి కీర్తికాంతి

శిలతో ఓ నీటితొట్టి
నిశ్చల నదిలో నా ముఖబింబం
ఈత కొట్టాలంటే
శరీరమంతా మునగాలా

శిలాయుగంలో వున్నానా?
కాదు శిలల

స్వర్ణయుగంలో
శిలల మీదే లతలూ పూలూ
శిలల మీదే నర్తకీమణులు
శిలల మీదే సంగీత వాద్యాలు
శిలల మదిలో సప్తస్వరాలు!

ఊహలెంత ఉన్నతాలైనా
కవిత్వంలోనే వాటికి స్థాన బలిమి
అనుకున్నా ఇన్నాళ్లు
ఇక్కడి స్థపతులు మహాకవులు
రామాయణ భాగవతాల్ని
శిలల్లోకి అనువదించారు

రాళ్లల్లో, ఎక్కడిదీ రుధిరకాంతి
తంగడి యుద్ధంలో తెగిపడ్డ
రక్తమాంసాలదా?
సూదంటురాళ్లు

చూద్దామన్నా లేవు
అనాదిగా నదితో స్నేహం మరి!

అక్కడక్కడా ఫ్రాన్స్, బెల్జియం
అమెరికా ఇంగ్లాండ్ యాత్రికులు
శిలలమధ్య శిలల్లా తన్మయంగా
మీ కెమెరా రీళ్లల్లో
వొదిగేది కాదయ్యా హంపి!

వందల ఏళ్లుగా నదీమధ్యంగా
ప్రవాహానికి తోడునీడగా
ఓ రాతి మండపం
పురందర దాసు మరంద
కీర్తనల్లో పునీతమై
ఇక్కడి కిలకిలా రావాలకు
కొండలకు కొండలే కరిగిపోయాయి!
మనమెంత

చరిత్ర రాజులదంటే వొప్పకోను
కళా ప్రియులైన వాళ్లే
చివరకు మిగిలారు
రాళ్లను మలిచిన వాళ్లు చిరంజీవులు
శ్రమజీవులే
ఎప్పటికైనా చక్రవర్తులు

ఇంటి ముఖం పడుతున్న రైలునది
స్లీపర్ బోగీలో
అర్ధరాత్రి నిశ్శబ్దం
కళ్లనిండా శిలల కలలు
తనువంతా అలలు అలలు.

- మంత్రి కృష్ణమోహన్

కవిత్వమ్

మరణశయ్య

పల్లె మేల్కొంది
వృత్తి నిద్రించింది
చేతులు యంత్రమై
గాలితిత్తి నింపాయి
కొలిమి రాజుకోదు
కర్రులు ఎర్రబడవు
బొగ్గులు నిండుకున్నాయి
కనురెప్పలు సాయమై
కనుగుడ్లు కార్చిన
కన్నీటి చెరువు
కలుజులు పొర్లింది
కొలిమి వొట్టిపోయింది!
నీళ్లు నిండిన మగ్గం గుంట
చేనేత దిగుడుబావి
పడుగు పేక
కండె నాడి పడకేశాయి
కదలని మగ్గం
నేతన్నకు శాపం



ప్రజాపతిది హ్రాస్వదృష్టి
సాయానిది చిన్న చూపు!
మట్టి పాత్రలపై
శరత్‌కాల పిడుగులు
సారె తిరగడం లేదు
ఉత్పత్తి సాగటం లేదు

మట్టి బంగారమై
కొండెక్కి కూర్చుంది
కొనలేని చేతులు
రిక్తహస్తాలై నిలిచాయి!
అరకలు సాగారటం లేదు
కాడి కదల్చలేదు
గాట కట్టిన జొడెద్దులు
నెమరులు మరిచాయి
చినుకులు తాకని నేల
అగ్గిని మరపిస్తోంది
ఏరువాకను వరుణుడు
ఎటో మళ్లించాడు
కటాక్షించని నింగి కింద
కర్షకుడి దీనగాథ
వృత్తి మరణించింది
పల్లె దుఃఖించింది!

- అడిగోపుల వెంకటరత్నమ్

నవ్వుల్ - పువ్వుల్

యోగా ... గోళ్లు

(కవితకు గోళ్లు కొరికే అలవాటుంది. దాన్ని మానడానికి యోగా శిక్షణ తీసుకుంటోంది)

అనిత: ఏమోయ్! యోగాలో చేరాక నీ చేతి గోళ్లు బాగా పెరిగాయే. అంటే గోళ్లు కొరకడం మానేశావన్నమాట.

కవిత: అవును చేతి వేళ్ల కొరకడం మానేశాను.

అనిత: అంటే...

కవిత: నాకు ఇప్పుడు కాలి వేళ్లు అందుతున్నాయి కదా. వాటిని కొరుకుతున్నాన్లే.

దేవుడు

(ఓ వ్యక్తి ఒక కుక్కను, పిల్లిని పెంచుకుంటున్నాడు. అవి ఓసారి...)

కుక్క: మా యజమాని నాకు చక్కటి భోజనం పెడతాడు. నాకోసం ప్రత్యేకంగా ఓ ఇంటిని కూడా కట్టించాడు. పైగా నన్ను ఎంతగానో ప్రేమిస్తాడు. నా గురించి చాలా జాగ్రత్తలు తీసుకుంటాడు. ఆయన దేవుడు.

పిల్లి: మా యజమాని నాకు చక్కటి భోజనం పెడతాడు. నాకోసం ప్రత్యేకంగా ఓ ఇంటిని కూడా కట్టించాడు. పైగా నన్ను ఎంతగానో ప్రేమిస్తాడు. నా గురించి చాలా జాగ్రత్తలు తీసుకుంటాడు. ఎందుకంటే...నేను దేవతను కాబట్టి.

చంద్రయానం

భారత ప్రధాని: మేం వచ్చే సంవత్సరం చంద్రమండలంలోకి మనుషులను పంపాలనుకుంటున్నాం.

అమెరికా ప్రధాని: వావ్! ఎందరిని?

భారత ప్రధాని: ఏడుగురు ఒబిసిలు, ఐదుగురు ఎస్సీలు, ఎనిమిది మంది ఎస్టీలు, ముగ్గురు వికలాంగులు, ఇద్దరు క్రీడాకారులు, ముగ్గురు టెర్రరిస్టు బాధితులు, ముగ్గురు కాశ్మీరీ వలసలు, ఇద్దరు ఎంపీలు, ఒక వ్యోమగామిని పంపుదామనుకుంటున్నాం.

ఫీజు

సంపత్: లాయర్‌గారూ మీ ఫీజు ఎంత?

లాయర్: మూడు ప్రశ్నలకు 5 వేల రూపాయలు.

సంపత్: అబ్బో చాలా ఎక్కువేనే?!

లాయర్: అవును. ఇంక మీ మూడో ప్రశ్న ఏంటి?

కొడతారు

(ఓ భార్యా భర్తా విడాకులు తీసుకోవాలనుకుంటారు)



జడ్జి: బాబూ! నువ్వు మీ అమ్మతో కలిసి వుంటావా?

పిల్లవాడు: వద్దు. మా అమ్మ నన్ను కొడుతుంది.

జడ్జి: ఓ...అంటే నువ్వు మీ నాన్నతో కలిసి వుంటావా?

పిల్లవాడు: ఊహూ...నాన్న కూడా నన్ను కొడతాడు.

జడ్జి: (బుర్ర గోక్కుంటూ...) మరి ఎవరితో వుంటావు?

పిల్లవాడు: నేను ఇండియన్ క్రికెట్ టీమ్‌తో వుంటాను. వాళ్లైతే ఎవరినీ కొట్టరు.

మిస్స్‌డ్ కాల్

(సంతోష్, సంగీత్ ఫోన్ బదులుగా పావురాలను ఉపయోగించాలనుకుంటారు)

సంతోష్: (సంగీత్ పంపిన పావురం దగ్గర ఏ ఉత్తరం వుండదు. దాంతో ఫోన్ చేసి) రేయ్! పావురం మెసేజ్ ఏం తేకుండా ఉత్తినే వచ్చిందే.

సంగీత్: పిచ్చి సన్నాసీ. అది మిస్స్‌డ్ కాల్‌రా.

గబ్బిలం

బాస్: (ఉద్యోగితో...) నువ్వు ఎప్పుడైనా గబ్బిలాన్ని చూశావా?

ఉద్యోగి: (కిందికి చూస్తూ...) లేదు సార్.

బాస్: కిందికి చూడకు. నావైపు చూడు.

ఉద్యోగి: (అంటే బాస్ గబ్బిలం లాగుంటాడా?)

సరిపోతుందా?

(పెళ్లి చూపుల్లో అబ్బాయి....)



అబ్బాయి: నా జీతం నీకు సరిపోతుందా?

అమ్మాయి: నాకు సరిపోతుంది. మరి నువ్వెలా బతుకుతావ్?

ఇన్‌ఫెక్షన్ కాకుండా

రాఘ్: ఏంటి? కత్తిని వేడి చేస్తున్నావ్?

ఓమ్: ఆత్మ హత్య చేసుకుందామని.

రామ్: అందుకైతే కత్తిని వేడిచేయడమెందుకు?

ఓమ్: ఇన్‌ఫెక్షన్ కాకుండా...

కె. సాహిల్, హైదరాబాద్.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్



ఈ మధ్య కాలంలో విడుదలవుతున్న హిందీ చిత్రాలు ఏవైనా చూశారా? 'గజినీ', 'వాంటెడ్', 'రెడీ' - ఇలా ఏ చిత్రం చూసినా ఈ కథ మనకు తెలిసిందే, మనం తెరపై చూసిందేనే అని ఆశ్చర్యం కలుగుతోందా? ఆ ఆశ్చర్యానికి కారణం ఒక్కటే! ఇవాళ అనేక తెలుగు, తమిళ చిత్రాలు హిందీలోకి రీమేకవుతున్నాయి. ఇంకా చెప్పాలంటే, ఈ మధ్య కాలంలో మన దక్షిణాది చిత్ర కథలు అనేకం హిందీ తెరపైనా విజయ ఢంకా మోగిస్తూ, వసూళ్ళ వర్షం కురిపిస్తున్నాయి.

దక్షిణాది కథలకు ఉత్తరాన క్రేజు

తెలుగు, తమిళ, మలయాళ భాషా చిత్రాలు చాలా భాగం ఇప్పుడు దక్షిణాది నుంచి ఉత్తరాదికి ప్రయాణం చేస్తున్నాయి. హిందీ చిత్రసీమలోని భారీ సంస్థలు ఇక్కడి కథలను అక్కడ తాజాగా తెరకెక్కిస్తున్నాయి. మొన్నటి అమీర్‌ఖాన్ 'గజినీ' (అదే పేరుతో హీరో సూర్య నటించిన తమిళ చిత్రానికి రీమేక్), నిన్నటి సల్మాన్ ఖాన్ 'వాంటెడ్' (మహేష్‌బాబు తెలుగు 'పోకిరి' దీని మాతృక), నేటి 'రెడీ' (అదే పేరుతో రామ్ నటించిన తెలుగు చిత్రం దీని మూలం), రేపటి అజయ్ దేవ్‌గన్ 'సింగం' (సూర్య నటించిన తమిళ 'సింగం'కి రీమేక్), జాన్ అబ్రహామ్ 'ఫోర్స్' (సూర్య నటించిన తమిళ చిత్రం 'కాక్క...కాక్క...', వెంకటేష్ నటించిన తెలుగు రీమేక్ 'ఘర్షణ' దీనికి మూలం), 'ఇటీజ్ మై లైఫ్' (తమిళంలోనూ 'సంతోష్ సుబ్రమణియమ్'గా రీమేకైన సిద్ధార్థ్ 'బొమ్మరిల్లు' దీనికి ఒరిజినల్) - ఇలా అనేక హిందీ చిత్రాలు దక్షిణాది హిట్లకు సరికొత్త రూపాలే!

కొత్త క్రేజుకు కారణం

మణిరత్నం నిర్మించే ద్విభాషా చిత్రాలు, రీమేక్‌లు మలయాళ హిట్లను హిందీలో పునర్నిర్మించే ప్రియదర్శన్ సినిమాలే ఈ మధ్య వరకు హిందీలో అప్పుడొకటీ అప్పుడొకటిగా దర్శనమిచ్చేవి. ప్రియదర్శన్ హిందీలోకి తీసుకువెళ్ళిన మలయాళ కథలు సైతం ప్రధానంగా హాస్య చిత్రాలే. అక్షయ్ కుమార్, సునీల్‌శెట్టి తదితర హీరోలు నటించే ఈ కామెడీ చిత్రాల మార్కెట్ స్థాయి కూడా పరిమితమే. కానీ, హిందీలో 'గజినీ', 'వాంటెడ్' చిత్రాలు ఘన విజయం సాధించి, కోట్లు కురిపించడంతో, ప్రస్తుతం రీమేక్‌లు అక్కడ ఓ పెద్ద హిట్ ఫార్ములాగా మారాయి. పలువురు హిందీ అగ్ర హీరోలు, దర్శక, నిర్మాతలు దక్షిణ భారతీయ హిట్ చిత్రాల రీమేక్ హక్కుల కోసం పోటీలు పడుతున్నారు. ఇప్పుడు దాదాపు ఓ డజను దక్షిణ భారతీయ చిత్రాలు హిందీలో సెట్స్ మీద ఉన్నాయంటే, ఈ పునర్నిర్మాణాల క్రేజు ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రానున్న 'సింగమ్', 'ఫోర్స్', 'బాడీగార్డ్', 'కిక్', 'ఇటీజ్ మై లైఫ్' లాంటివన్నీ తమకు కాసులు కురిపిస్తాయని దర్శక, నిర్మాతలు భావిస్తున్నారు. నిజానికి, "దక్షిణాది కథలు, హిందీలోకి వెళ్ళడం ఇవాళ కొత్తేమీ కాదు. దర్శక - నిర్మాత ఎల్.వి. ప్రసాద్ చిత్రాల రోజుల నుంచీ ఈ ధోరణి ఉన్నదే" అని గడచిన ఆరు దశాబ్దాల పైగా తెలుగు చిత్ర రంగాన్ని సన్నిహితంగా అధ్యయనం చేస్తున్న సినీ విశ్లేషకులు కాట్రగడ్డ నరసయ్య అన్నారు. అయితే, అప్పట్లో కొన్నిసార్లు కథ హక్కులు కొనుగోలు చేయకుండా 'ఫ్రీ మేక్'లుగానూ ఈ రీమేక్‌లు తయారవుతుండేవి. "ఇటీవల హక్కులు కొని మరీ, రీమేక్ చేయడం ఎక్కువైంది. పైగా ప్రేక్షకులు ఈ రీమేక్‌లను ఆదరిస్తున్నారు. అదీ విశేషం" అని ఆయన వ్యాఖ్యానించారు.

హిందీ హీరో, దర్శక, నిర్మాతలు విజయాల కోసం ప్రస్తుతం ఎంత ఆతురత మీద ఉన్నారంటే - ఇక్కడి కథలే కాదు, హిట్ పాటల బాణీలను కూడా బాహాటంగా అనుసరిస్తున్నారు. తెలుగు 'ఆర్య -2' చిత్రంలోని జనరంజక గీతం 'రింగ రింగ...' ఇప్పుడు సల్మాన్ ఖాన్ హిందీ 'రెడీ'లో 'ఢింక చిక ఢింక చిక...'గా అవతారమెత్తింది. భాషాభేదం లేకుండా ఎంతోమందిని ఆకర్షించిన 'రింగ రింగ...' పాట ఇప్పుడు ఈ కొత్త రూపంలో దేశ, విదేశాల్లో భారతీయ సినీ ప్రేమికులతో స్టెప్పులేయిస్తోంది.

ఒక హిట్టుతో అనేక రీమేక్‌లు

దక్షిణాదిలో సైతం ఒక భాషలో ఒక చిత్రం పెద్ద హిట్టయిందంటే, అది ఇతర భాషల్లోకి చకచకా రీమేక్ అవడం ఇప్పుడు ఎక్కువైంది. ఆ హిట్ కథ హిందీ చిత్రసీమను సైతం ఆకర్షిస్తోంది. తెలుగు హిట్లు 'బొమ్మరిల్లు', 'విక్రమార్కుడు', 'ఏ మాయ చేసావె..' చిత్రాలు ఇప్పటికే హిందీలోకి రీమేక్ అవుతుంటే, 'వేదం', 'మగధీర', 'ఆర్య-2' మొదలు ఇటీవలి 'అలా మొదలైంది...' వరకు పలు చిత్రాలను జాతీయ భాషలో దేశవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకువెళ్ళాలని హిందీ చిత్ర దర్శక, నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు.

ఇలా మన తెలుగుతో సహా వివిధ దక్షిణాది చిత్ర కథలకు హిందీలో క్రేజు పెరిగిన తీరు 1980లలో కూడా సాగింది. తెలుగులో హిట్టయిన అనేక చిత్రాలను హీరో కృష్ణ సారథ్యంలోని పద్మాలయా పిక్చర్స్ లాంటి సంస్థలు హిందీలో జితేంద్ర నాయకుడిగా రీమేక్ చేశాయి. 'మాంగ్ భరో సజ్‌నా' (1980 - తెలుగులో 'కార్తీక దీపం'), 'హిమ్మత్‌వాలా' (1983 - తెలుగులో 'ఊరికి మొనగాడు'), 'లోక్ - పరలోక్' (1979 - తెలుగులో 'యమగోల') లాంటి అప్పటి చిత్రాలన్నీ దక్షిణాది హిట్లకు హిందీ రూపాలే. తెలుగు 'వంశవృక్షం'లో నటించిన హిందీ నటుడు అనిల్ కపూర్ సైతం కొన్ని తెలుగు చిత్రాల హిందీ రూపాల్లో కనువిందు చేశారు.

హిందీ అగ్రహీరో సల్మాన్ ఖాన్ తాజాగా రీమేక్‌ల జోరు మీదున్నారు. 'వాంటెడ్', 'రెడీ' తరువాత ఆయన ప్రస్తుతం 'బాడీగార్డ్' (మలయాళం), 'కిక్' (తమిళం) చిత్రాల హిందీ పునర్నిర్మాణాల పనిలో ఉన్నారు. "హిందీ సినీ రంగంలో ఎంతో మంది గొప్ప రచయితలు ఉన్నారు. అయినా, నేనిప్పుడు దక్షిణాది చిత్రాల రీమేక్ కథలకు తెరపై నటించడం యాదృచ్ఛికం" అని ఆ మధ్య సల్మాన్ అన్నారు.

ఇక్కడ హిట్టయితే, అక్కడా హిట్టేనా?

మనకు తెలుగులో రవిరాజా పినిశెట్టి లాంటి కొందరి లాగానే, హిందీలో ప్రస్తుతం దర్శక - రచయిత అనీస్ బాజ్మీ రీమేక్‌ల స్పెషలిస్టుగా పేరు గడించారు. కన్నడంలో 'రామ్'గా, తమిళంలో ధనుష్‌తో 'ఉత్తమ పుత్తిరన్'గా రీమేకైన తెలుగు 'రెడీ' చిత్రం తాజా హిందీ రూపానికి అనీస్ బాజ్మీయే దర్శకుడు. 'బొమ్మరిల్లు' హిందీ వెర్షన్‌కూ ఆయనే నిర్దేశకుడు. అయితే, రీమేక్ అంటే అందరూ అనుకొంటున్నట్లుగా కేవలం కాపీ కొట్టడం కాదని ఆయన అభిప్రాయం. "దక్షిణాది సినీ ప్రేక్షకుల భావాలు, అభిప్రాయాలు, ఆలోచనా ధోరణి ఉత్తరాది ప్రేక్షకులకు ఎంతో భిన్నమైనవి. కాబట్టి, దక్షిణాదిన హిట్టయిన ఓ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేసినంత మాత్రాన ఉత్తరాదిన కూడా విజయవంతమవుతుందని చెప్పలేం. అలా హిట్టయ్యేలా ఉంటే, రజనీకాంత్ చిత్రాలన్నీ మేము

రీమేక్ చేసేవాళ్ళం కదా! కాబట్టి, ఉత్తరాది ప్రేక్షకుల ముందుకు ఏ కథను, ఎలా తీసుకువెళితే విజయం సాధిస్తుందో అర్థం చేసుకోవాలి" అని అనీస్ బాజ్మీ వివరించారు.

హిందీ సినీ రంగానికి తగ్గట్లుగా కథనూ, కథా పరిసరాలనూ మార్చడంలో ఆయన సిద్ధహస్తుడు. హర్మన్ బవేజా, జెనీలియా జంటతో 'ఇటీజ్ మై లైఫ్'గా రూపొందుతున్న 'బొమ్మరిల్లు' రీమేకే అందుకు ఉదాహరణ. తెలుగు మాతృక 'బొమ్మరిల్లు' అంతా ప్రధానంగా ఒకే ఇంట్లోనే జరుగుతుంది. కానీ, దాన్ని హిందీకి తగ్గట్లు తీస్తున్నప్పుడు నార్వే మొదలు న్యూజిలాండ్, బ్యాంకాక్, ఢిల్లీ, రాజస్థాన్‌ల దాకా అనేక ప్రదేశాల్లో దర్శక - రచయిత అనీస్ చిత్రీకరణ జరిపారు. "దర్శకుడి కన్నా ముందు నేను రచయితను. కాబట్టి, ఏదైనా సినిమాను చూస్తున్నప్పుడే, నేనే గనక అయితే, దాన్ని ఎలా తీస్తాననేది ఊహించుకుంటూ ఉంటాను" అని అనీస్ వ్యాఖ్యానించారు.

కొసరులోనూ అసలువాళ్ళే!

ఒక దక్షిణాది చిత్ర రీమేక్‌ను హిందీలో హిట్ చేస్తే, ఆ దర్శకుడికి మళ్ళీ మళ్ళీ అవకాశాలు రావడమూ కద్దు. తాజాగా 'బాడీగార్డ్' మలయాళ మాతృకకు దర్శకుడైన సిద్దిక్‌నే ఆ చిత్ర హిందీ రీమేక్‌కూ ఎంచుకోవడం విశేషం. మలయాళ మాతృకలో హీరో దిలీప్, హీరోయిన్ నయనతారలు దాని తమిళ రీమేక్ 'కావలన్'లో విజయ్, ఆసిన్‌లు ధరించిన పాత్రలను హిందీలో సల్మాన్, కరీనా కపూర్‌లు పోషిస్తున్నారు. ఇదే 'బాడీగార్డ్'ను తెలుగులో వెంకటేష్ త్రిషలతో పునర్నిర్మిస్తున్నారు. ఇప్పటికే, మలయాళ, తమిళ భాషల్లో పలు చిత్రాలు రూపొందించిన సిద్దిక్‌కు ఇదే తొలి హిందీ చిత్రం. "దక్షిణాదితో పోలిస్తే, హిందీ చిత్ర సీమ భిన్నమైనది. బాలీవుడ్‌లో ప్రతిదీ ఎంతో భారీ స్థాయిలో సాగుతుంది. అక్కడ బడ్జెట్ పెద్ద విషయమే కాదు. ప్రతిదీ ఎంతో ఆడంబరంగా సాగాలని భావిస్తారు" అని సిద్దిక్ చెప్పారు.

ఒక సినిమా సక్సెస్ అయితే, అందులో నటించిన హీరోయిన్ తదితర ప్రధాన తారాగణాన్ని రీమేక్‌లోనూ నటింపజేయడం ఎక్కువ సార్లు జరుగుతుంటుంది. తెలుగులో అనుష్క నటించగా హిట్టయిన 'వేదం' చిత్రాన్ని



'ఫోర్స్'లో జాన్ అబ్రహాం, జెనీలియా

తమిళంలో 'వానమ్' (2011)గా రీమేక్ చేశారు. తమిళ రూపానికి కూడా దర్శకుడు, ప్రధాన నాయిక తెలుగు మాతృకలోని వారే! 'బొమ్మరిల్లు'ను తమిళంలో 'సంతోష్ సుబ్రమణియమ్'గా తీసినప్పుడూ, ఇప్పుడు హిందీలో 'ఇటీజ్ మై లైఫ్'గా తీస్తున్నప్పుడూ కథానాయిక హాసిని పాత్రకు తెలుగు మాతృకలో హాసిని పాత్ర ధరించిన జెనీలియానే ఎంచుకున్నారు. తెలుగు 'రెడీ'లో పోషించిన పాత్రనే, తమిళ రీమేక్ 'ఉత్తమ పుత్తిరన్'లోనూ జెనీలియా ధరించారు. "మాతృకలో నేనే పోషించిన పాత్రను రీమేక్‌లోనూ చేయాల్సి వచ్చినప్పుడు, చాలా సందర్భాల్లో మాతృకే మనస్సులో వెంటాడుతుంటుంది" అని జెనీలియా తెలిపారు.

రీమేక్ చేస్తున్నప్పటికీ, కొందరు దర్శకులు మూలాన్ని గుడ్డిగా అనుసరించడం లేదు. 'గోల్ మాల్ 1, 2, 3', 'ఆల్ ది బెస్ట్' లాంటి నాలుగు వరుస హిట్లు రూపొందించిన దర్శకుడు రోహిత్ శెట్టి సైతం ఇప్పుడు తమిళ హిట్ 'సింగమ్'ను అదే పేరుతో హిందీలోకి తెస్తున్నారు. దక్షిణాది వాసనలు లేకుండా, అసలు సిసలు హిందీ చిత్రమనిపించేలా రంగులద్దడం కోసం ఈ రీమేక్‌లో కథను దాదాపు 60 శాతం మార్చేశారు. ఆసక్తికరమైన కొన్ని కొత్త అంశాలు కూడా చేర్చారు. 'రెడీ' హిందీ రూపంలో వినోదానికి పెద్ద పీట వేయడమే కాక, సల్మాన్‌ఖాన్ శైలిలో పోరాట సన్నివేశాలను రూపొందించారు.

రానున్న చిత్రాల సంగతికొస్తే, తమిళ 'కాక్క...కాక్క...'ను హిందీలో 'ఫోర్స్' పేర విపుల్ అమృత్ లాల్ షా నిర్మిస్తున్నారు. జాన్ అబ్రహమ్ నటిస్తున్న ఈ చిత్రానికి నిశికాంత్ కామత్ దర్శకుడు. ఇక, 'ఏ మాయ చేసావె...' దర్శకుడు గౌతమ్ మీనన్ ఆ కథను 'ప్రేమ్ కథ' పేరిట తానే హిందీలో రూపొందించనున్నారు. అందులో ప్రతీక్ బబ్బర్, ఎమీ జాక్సన్ ప్రధాన పాత్రధారులు. జీవా, కార్తీక నటించిన తాజా రాజకీయ థ్రిల్లర్ అయిన తమిళ 'కో' (తెలుగులో 'రంగం'గా ఆడుతోంది) చూసి, అక్షయ్ కుమార్ మోజు పడుతున్నారు. సల్మాన్ ఖానేమో తానేం తక్కువ తిన్నానంటూ, రవితేజ యాక్షన్ కామెడీ 'మిరపకాయ్' వెంట పడుతున్నారు.

సక్సెస్‌నిచ్చే స్క్రిప్టుల కోసమే...

ఇలా వరుసగా దక్షిణాది కథలు హిందీ చిత్రసీమలో రాజ్యమేలుతుండడం, సల్మాన్ లాంటి అగ్ర హీరోలు ఆ కథలకు ప్రాధాన్యమివ్వడం హిందీ రచయితలకు మింగుడుపడడం లేదు. చౌకబారు హాస్యం, తర్కం లేని పోరాటాల చుట్టూ తిరిగే దక్షిణాది చిత్ర కథలపై అతిగా ఆధారపడడం వల్ల హిందీ చిత్ర కథల్లో పురోగతి ఉండదని వారు వ్యాఖ్యానిస్తున్నారు. కానీ, నటుడు హర్మన్ బవేజా లాంటి వాళ్ళు మాత్రం, "కథ బాగుండి, ఒక భాష సినీ విపణిలో



'వాంటెడ్'లో సల్మాన్‌ఖాన్, ఆయేషాటకియా

విజయవంతమైనప్పుడు, మరో భాషలో దాన్ని రీమేక్ చేస్తే తప్పేముంది! ఏ భాషా చిత్రానికైనా చివరకు స్క్రిప్టే కదా కీలకం" అని అంటున్నారు.

రీమేక్‌ల దిట్ట అనీస్ బాజ్మీ సైతం సాంకేతిక అంశాల్లో దక్షిణాది కన్నా ఎంతో ముందంజ వేసిన హిందీ చిత్ర సీమ రచనలో మాత్రం ఇబ్బంది పడుతోందంటున్నారు. "సాంకేతికంగా మేము అంతర్జాతీయ ప్రమాణాలు సాధించాం. కానీ, స్క్రీన్‌ప్లే, సంభాషణల విషయంలో మాత్రం సరికొత్త, సృజనాత్మక ఆలోచనల కోసం సతమతమవుతున్నాం" అని ఆయన చెబుతున్నారు. పటిష్ఠమైన స్క్రీన్‌ప్లే ఉన్న చిత్రాల కోసం హిందీ చిత్ర సీమ దక్షిణాది వైపు చూస్తోంది. అందుకే, తెలుగులోని '100% లవ్' లాంటి తాజా హిట్ల హిందీ రీమేక్‌ల కోసం అప్పుడే చర్చలు జరుగుతున్నాయి. పైగా, ఇక్కడి చిత్రాల్లో తప్పనిసరి అయిన హాస్యం కూడా హిందీ చిత్ర కథలకు పనికొచ్చే అంశం. ఇలాంటి కారణాల వల్లే ఇప్పుడు తెలుగు 'కిక్', 'ఏ మాయ చేసావె...', 'ఆర్య-2', తమిళ 'కాదల్' (తెలుగులో 'ప్రేమిస్తే..'గా అనువాదమైంది) లాంటివి హిందీ రీమేక్‌కు వరుసలో ఉన్నాయి.

చిత్ర నిర్మాణశైలిలో వైరుధ్యం ఉన్నప్పటికీ, అన్ని చోట్లా తీసేది ప్రాథమికంగా అదే కథ. ఇటు దక్షిణాదిలోనూ, అటు ఉత్తరాదిలోనూ ప్రాచుర్యమున్న నటి జెనీలియా చెప్పినట్లు, "ప్రధానంగా తేడా అంతా సినిమా రూపురేఖలు, అది కనిపించే తీరులోనే! సినిమా ఆత్మ మాత్రం ఒకటే!" పునర్నిర్మాణ ప్రయత్నంలో పాల్గొంటున్న వారందరూ ఎంత సమర్థంగా ఆ పని చేస్తే, రీమేక్ కూడా అంత బాగా వస్తుంది. లేదంటే, అసలు కథకు ఇది ప్రాణం లేని నకలుగా మారిపోయే ప్రమాదం ఉంటుంది. అది తెలుసుకుంటే, రీమేక్‌ల హవా ఇప్పుడే కాదు, ఎప్పుడూ కొనసాగుతుంది. తెలుగు కథలకు మరో మార్కెట్‌గా అవతరించిన హిందీ చిత్రసీమ నుంచి మన నిర్మాతలు ఆశిస్తున్నది అదే!

- రెంటాల జూనియర్

పాలరాతి పుష్పం



అదో అపురూపమైన పుష్పం. పాలరాతి పద్మం. అందులో మొత్తం ఇరవైఏడు రేకులుంటాయ్! మూడు వరుసల్లో తొమ్మిది చొప్పన అమర్చినట్టు విరిసిన పుష్పమది. ఆ పాలరాతి పద్మం అందానికే కాదు... స్వచ్ఛతకూ... చిహ్నమే. ఈ పద్ధతిలో పాలరాతి రేకుల్ని అమర్చితే... అద్భుత నిర్మాణమౌతుంది. అదే పద్మాలయం. బహాయిూల ప్రార్థనామందిరం.

ఇంత అందమైన అపురూపమైన నిర్మాణం ఓ ఆలయం అంటే నమ్మబుద్ధి కాదు. అదే పద్మాలయం. 1987లో జనవరి ఒకటవ తేదీన ఢిల్లీలో విరిసిన అద్భుత పుష్పమిది. దీన్ని చూడ్డానికి ఎందరో ఎక్కడెక్కడినుంచో వచ్చారు. సువిశాల మైదానంలో కొలువు తీరిన ఈ శ్వేత మందిరాన్ని చూడ్డానికి జనం బారులు తీరారు.

ఎంతో ఆసక్తిగా అపురూప పుష్పం ఆకారంలో వున్న కట్టడం లోనికి వెళ్లిన వారికి నోటెంట మాట రాలేదు. మౌనం...మౌనం...ఎల్లెడలా మౌనమే! ఒక్కరికి కూడా నోట మాట రాలేదు. అందుకు కారణం లేకపోలేదు. లోపల అస్సలు దేవుడే లేడు. ఏ దేవుడూ లేడు. ఏ గుడికెళ్లినా మనకు దైవస్వరూపం కనిపించడం సర్వసాధారణం. చర్చికెళితే మేరీమాత, జీసస్ కనిపిస్తారు. హిందూ దేవాలయాలైతే సరేసరి. ఆఖరుకు దర్గాకెళ్లినా పవిత్ర గ్రంథంగా భావించే ఖురాన్ అయినా కనిపిస్తుంది. కానీ ఇక్కడ అలాంటి చిహ్నామేదీ కనిపించదు. లోపలంతా ఖాళీగా వుంటుంది. చేతులు జోడించి మనస్సును లగ్నం చేయడానికి అక్కడ ఒక్క విగ్రహమూ కనిపించదు. అదే దీని ప్రత్యేకత. అదే ఈ లోటస్ టెంపుల్.

అసలిలాంటి ఆలయాలు ఎక్కడైనా వున్నాయా? అనిపిస్తుంది. చరిత్రలోకి తొంగిచూస్తే ఇలాంటి ఆలయం ఒక్కటి కనిపిస్తుంది. అదే పురాతన కాల్కాజీ ఆలయం. ఈ వివరాలన్నీ అక్కడ గైడ్‌లు చక్కగా వివరిస్తారు. కానీ గుడికెళ్లాక మనకో అలవాటుంటుంది. విగ్రహానికి నమస్కరించాల్సిందే. అందుకే వెంట తీసుకెళ్లిన పువ్వునో, పండునో ఏదో ఒక మూలన పెట్టి నమస్కరిస్తుంటారు సందర్శకులు. అయితే అనేకమంది మాత్రం లోపలికెళ్లాక ఆ ఆలయ సౌందర్యాన్ని ఆరాధించడంలోనే క్షణం తీరిక లేకుండా మునిగిపోతారు. అయితే అక్కడికెళ్లిన వారందరికీ అది బహాయిూ మతానికి చెందిన ఆలయమన్న విషయం తెలియకపోవచ్చు.



బహాయిూ ఏంటి?

అసలు బహాయిూ ఏంటి? అంటే... కులమతాలతో పని లేకుండా విశ్వమానవాళి శాంతిని ఆశించి వెలసిందే బహాయిూ. వీరిదో ప్రత్యేక సమాజం. స్వచ్ఛంద సంస్థల్ని ఏర్పాటు చేసి విద్య, ఉపాధి సౌకర్యాలు కల్పిస్తూ ఇతోధికంగా సహాయ కార్యక్రమాలు చేస్తుంటారు. బహాయిూ సమాజ స్థాపకుడు బహాయుల్లా. అన్ని మతాల్లోని సారాన్ని గ్రహించి బహాయుల్లా, ఆయన కుమారుడు అబ్దుల్ బహాలు రాసిన సందేశాల్నే బహాయిూలు ఆచరిస్తుంటారు. విశ్వసిస్తారు. ప్రార్థిస్తారు. అందుకోసం నిర్మించేవే ఆలయాలు. వీటిని అత్యంత సుందరంగా నిర్మించాలనుకుంటారు బహాయిూలు. అమెరికా, యూరప్, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, వంటి చోట్ల బహాయిూల కట్టడాలు మైమరపింపచేస్తున్నాయి. నిశ్శబ్దంలోని శాంతినీ గొప్పతనాన్ని ప్రతిబింబిస్తూ ఆధ్యాత్మిక భావాలకు ద్వారాలు తెరిచే ప్రశాంత మందిరాలుగా ఇవి గుర్తింపు పొందాయి.

ఈ ఆలయాలను చూసిన వారు ఎన్నెన్నో భావాలను వ్యక్తీరిస్తుంటారు. అసలు ఆ అందాన్ని వర్ణించడానికి మాటలు చాలవనేవారు కొందరైతే... ఇరవయ్యవ శతాబ్దపు అద్భుతం అనేవారు మరి కొందరు.

వాస్తుశిల్పంలో ఎన్నో అవార్డుల్ని అందుకుందీ మందిరం. భారత ఉపఖండంలోనే మదర్ టెంపుల్‌గా మన్ననలందుకున్న అత్యున్నత ఆలయమిది. దీని వాస్తుశిల్పి ఎవరో తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ఇరాన్‌కు చెందిన ఫారిబోర్జ్ సాహ్‌బా. అయితే దీనికి స్థలాన్ని ఇచ్చింది మాత్రం ఆర్డిషిర్ రుస్తామ్ పుర్. హైదరాబాదీ అయిన ఈయన తను జీవితాంతం దాచుకున్నదంతా ఆలయానికే ఇచ్చేశాడు.

విరిసీ విరియని కమలం

ఈ పాలరాతి కట్టడం ఢిల్లీ సరిహద్దుల్లోని బహాపుర్ గ్రామంలో వుంది. 26 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 40 మీటర్ల ఎత్తున నిర్మించిన కట్టడమిది. ఈ పాలరాతి కట్టడాన్ని సుదూరంగా నిలబడి చూస్తే నీళ్లల్లో తేలుతున్నట్టే వుంటుంది. ఎందుకంటే దీని చుట్టూ 9 కొలనులున్నాయి మరి. చుట్టూ ఆకులున్నట్టు నీటిలో తేలుతున్నట్టు కనిపించే ఈ పద్మాలయానికి 9 ద్వారాలున్నాయి. ఇవన్నీ మధ్యలో వున్న హాల్లోకి తెరుచుకుంటాయి.
విరిసీ విరియని తామరపుష్పంలా కనిపించే ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చే వారి సంఖ్య ఏ ఏటికాఏడు పెరుగుతోందే కానీ తరగడం లేదు. ఇంక పండుగలు, పబ్బాలూ వచ్చినప్పుడైతే మరీ రద్దీగా వుంటుంది. ★



చికెన్ మంచూరియా

కావలసిన పదార్థాలు

ఎముకలు లేని చికెన్ – అరకిలో,
సోయాసాస్ – 1 స్పూన్, చైనా సాల్ట్ – అరస్పూన్, మిరియాలపొడి – అరస్పూన్, వెనిగర్ – 1 స్పూన్, **సాస్ కోసం :** మిరియాల పొడి – పావు స్పూన్, చైనా సాల్ట్ – పావుస్పూన్, చికెన్ స్టాక్ (చికెన్ ముక్కలు కడిగిన నీళ్లు)– అరకప్పు, కార్న్‌ఫ్లోర్ – 1 స్పూన్ మైదాపిండి – 2 స్పూన్లు, సోయాసాస్ – 1 స్పూన్, పంచదార– 1 స్పూన్
టమాటా సాస్– 1 స్పూన్, అజినమోటో – చిటికెడు
ఉల్లికాడలు – 4, వెల్లుల్లి ముక్కలు – 1 స్పూన్

తయారు చేసే విధానం

కార్న్‌ఫ్లోర్, మైదాపిండి, ఉప్పు, మిరియాల పొడి, వెనిగర్, సోయాసాస్‌లను కలిపి... అందులో కడిగిన చికెన్ ముక్కల్ని వేయాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపి అరగంట నాననివ్వాలి. బాండీలో నూనె వేడిచేసి ఈ చికెన్ ముక్కల్ని వేయించాలి. తర్వాత అదే బాండీలో కొంచెం నూనె వుంచుకుని పచ్చిమిర్చి, వెల్లుల్లి, ఉల్లికాడ ముక్కలు, సోయాసాస్, పంచదార, చికెన్ స్టాక్, టమాటా సాస్, ఉప్పు, మిరియాల పొడి, అజినమోటో వేసి కలపాలి. కొద్దిగా చిక్కబడిన తర్వాత ముందు వేయించి పెట్టుకున్న చికెన్ ముక్కలు అందులో వేసి ఆ మిశ్రమం ముక్కలకు పట్టేవరకు కలపాలి. అంతే రుచికరమైన చికెన్ మంచూరియా రెడీ.

బేబీకార్న్ మంచూరియా



కావలసిన పదార్థాలు

బేబీకార్న్ – 5
మొక్కజొన్న పిండి – అరకప్పు
బియ్యం పిండి – పావుకప్పు
కారం – కొద్దిగా, ఉప్పు – తగినంత
అల్లం వెల్లుల్లి పేస్ట్ – 1 స్పూన్
నూనె – వేయించడానికి సరిపడా, ఉల్లికాడలు – 1 కట్ట
ఉల్లిపాయ – 1, వెల్లుల్లి – 4 రెబ్బలు, సోయా సాస్– 1 స్పూన్
చిల్లీసాస్ – 1 స్పూన్, టమాటా సాస్– 1 స్పూన్

తయారు చేసే విధానం

బేబీకార్న్‌ను చిన్న ముక్కలు చేసి... ఉప్పు నీళ్లలో ఉడికించాలి. ఒక పాత్రలో మొక్కజొన్న పిండి, బియ్యం పిండి, కారం, అల్లం వెల్లుల్లి పేస్ట్, తగినంత ఉప్పు వేసి బజ్జీల పిండిలా కలుపుకోవాలి. ఇందులో ఉడికించిన బేబీకార్న్‌ను ముంచి బజ్జీల్లా వేయించాలి. బాండీలో కొద్దిగ నూనె వేసి అందులో వెల్లుల్లి, ఉల్లిముక్కలు, ఉల్లికాడ ముక్కలు ఎర్రగా వేయించాలి. ఇందులో బేబీకార్న్ బజ్జీలని వేయాలి. వాటిపైన సోయా సాస్, చిల్లీసాస్, టమాటా సాస్, కొద్దిగా ఉప్పు చల్లితే చాలు. వేడివేడి బేబీకార్న్ మంచూరియా రెడీ.

రుచి

వెజ్ మంచూరియా

కావలసిన పదార్థాలు

క్యాబేజీ తరుగు – 1 కప్పు, క్యారెట్ తరుగు – 1 కప్పు
ఉల్లికాడ తరుగు – 1 కప్పు, పచ్చిమిర్చి ముక్కలు – 1 స్పూన్, వెల్లుల్లి ముక్కలు – 1 స్పూన్, కార్న్‌ఫ్లోర్ – అరకప్పు, మైదా– అరకప్పు, సోయాసాస్– 1 స్పూన్, ఉప్పు – తగినంత
మిరియాల పొడి– 1 స్పూన్, పంచదార– 1 స్పూన్
అజినమోటో – చిటికెడు, నూనె – వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం

క్యాబేజీ, క్యారెట్ ముక్కలు, ఉప్పు కలిపి కొద్దిసేపు ఉంచాలి. ఈ ముక్కలకి కార్న్‌ఫ్లోర్, మైదా, ఉప్పు చేర్చి గట్టిగా కలపాలి. అవసరమైతే కొబ్బరి నీళ్లు కలపొచ్చు. ఈ పిండిని చిన్నచిన్న ఉండల్లా చేసి నూనెలో బంగారు రంగు వచ్చేదాక వేయించాలి.

మరొక బాండీలో రెండు స్పూన్లు నూనె వేడి చేయాలి. వెల్లుల్లి ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, ఉల్లికాడ ముక్కలు, వేయించాలి. కొద్దిగా నీళ్లు పోసి, ఉప్పు, మిరియాల పొడి, అజినమోటో పంచదార, సోయాసాస్ కలపాలి. ఐదు నిమిషాలయ్యాక వేయించిపెట్టుకున్న ఉండల్ని ఈ మిశ్రమంలో కలపాలి. దీన్ని సన్నమంట మీద ఉంచి కలుపుతూ ఉండాలి. ఐదు నిమిషాల తర్వాత దించేయాలి. సర్వ్ చేసేముందు ఉల్లికాడ ముక్కలు, సన్నగా తరిగిన కొత్తిమీరతో అలంకరిస్తే బావుంటుంది.



గోబీ మంచూరియా

కావలసిన పదార్థాలు

క్యాలీఫ్లవర్ గుత్తులు (పువ్వులు) – 1 కప్పు, మైదాపిండి – అరకప్పు
మొక్కజొన్న పిండి – అరకప్పు, గుడ్డు – 1, మిరియాల పొడి– 1 స్పూన్
అజినమోటో – చిటికెడు, ఫుడ్ కలర్ – చిటికెడు, ఉప్పు – తగినంత
వెల్లుల్లి ముక్కలు – 1 స్పూన్, కరివేపాకు – 3 రెమ్మలు, ఉల్లికాడలు – 4
నూనె – వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం

క్యాలీఫ్లవర్ పువ్వులను వేడి నీళ్లలో ఐదు నిమిషాలు ఉంచి తీయాలి. మొక్కజొన్న పిండి, మైదాపిండి, గుడ్డు, మిరియాలపొడి, ఉప్పు, ఫుడ్ కలర్, అజినమోటో అన్నీ ఒక పాత్రలో వేసి కలపాలి. క్యాలీఫ్లవర్ ముక్కలను ఆ మిశ్రమంలో వేసి కలపాలి. వీటిని కాగిన నూనెలో వేయించుకోవాలి.

మరొక బాండీలో రెండు స్పూన్లు నూనె వేడి చేయాలి. వెల్లుల్లి ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, ఉల్లికాడ ముక్కలు, వేయించాలి. అందులో వేయించి పెట్టుకున్న క్యాలీఫ్లవర్ ముక్కల్ని వేసి కలపాలి. పొడి పొడిగా ఉండాలనుకునేవారు అలాగే తినొచ్చు. ముక్కలు కొంచెం మెత్తగా ఉండాలంటే సోయాసాస్ కలపాలి.



★

చూద్దామా

విలాసాల మకావు

అదో ప్రత్యేకమైన ప్రాంతం. విలాసాలకు, జల్సారాయుళ్లకు ఎంతో ఇష్టమైన కాసినోలు ఎన్నున్నాయో లెక్కేలేదు. అందుకే దీన్ని 'లాస్ వేగాస్ ఆఫ్ ద ఈస్ట్' అని కూడా పిలుస్తారు. అర్ధరాత్రుళ్లు కూడా పట్టపగల్లాగే కనిపిస్తాయి. చేతి నిండా డబ్బులు... మది నిండా హుషారు ఉండాలే కానీ దేనికీ కొదవలేదక్కడ. ఇవే కాకుండా చర్చిలూ, మ్యూజియాలూ, చక్కని ప్రదేశాలూ చాలానే ఉన్నాయి. వీటన్నింటిని చూడాలంటే 'మకావు' వెళ్లాల్సిందే...



మకావు టవర్

వెనీషియస్ క్యాసినో

హాంకాంగ్, మకావు చైనాలో భాగాలే. కానీ ఆ రెండూ స్వతంత్ర ప్రాంతాలుగా ఉన్నాయి.. వీటికి ప్రత్యేకమైన చట్టాలు, అధికారాలు ఉన్నాయి. మకావు చైనా దక్షిణ తీరంలో పెరల్ నది ఒడ్డున వుంది.

ఫెర్రీలోనే వెళ్లాలి

హాంకాంగ్ నుండి మకావు వెళ్లాలంటే ఫెర్రీలోనే వెళ్లాలి. హాంకాంగ్ నుండి మకావుకి గంట ప్రయాణం. రానుపోను ఛార్జీలు మన కరెన్సీలో 700 రూపాయలు.

మకావులో జనవరి నుండి మార్చి వరకు శీతాకాలం. వణికించే చలి ఉంటుంది. ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతుంది. మే నుండి సెప్టెంబర్ వరకు వేసవికాలం. అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు వర్షాకాలం. అక్టోబర్‌లో తుఫానులు ఎక్కువగా వస్తుంటాయి. మకావు పర్యటనకు నవంబర్, డిసెంబర్ నెలలు అనుకూలంగా ఉంటాయి.

పోర్చుగీసు వారు పదహారో శతాబ్దంలో మొట్టమొదట అడుగుపెట్టింది మకావులోనేనట. వాళ్లు 1999 వ సంవత్సరం తర్వాతే ఇక్కడ్నుండి వెళ్లారు. అప్పట్నుండి ఇదొక ప్రత్యేక ప్రాంతంగా రూపుదిద్దుకుంది. మకావు జనాభా దాదాపు ఐదున్నర లక్షలు. ఇక్కడి రూపాయిలను 'పటాకా' అంటారు. మన కరెన్సీలో అయితే ఒక పటాకా ఐదు రూపాయలకు సమానం. ఇక్కడ హాంకాంగ్ డాలర్లు కూడా చెల్లుతాయి. కానీ మకావు కరెన్సీ హాంకాంగ్, చైనాలలో చెల్లదు.

మన కంటే హాంకాంగ్ వాళ్లు రెండున్నర గంటలు ముందుంటారు. ఇక్కడ చైనీస్ ఫుడ్ ఎక్కువగా ఉంటుంది. ఇండియన్ హోటళ్లు కూడా ఉన్నాయి. వాటిని ఎక్కువగా భారతీయులే నడుపుతున్నారు.

మకావులో బౌద్ధులు ఎక్కువగా కనిపిస్తారు. ఇక్కడి ఇళ్లన్నీ చైనీస్- పోర్చుగీసు శైలిలో కట్టారు. మకావు వాసులు ఎక్కువగా మాట్లాడే భాష కాంటోనీస్. మాండరిన్ (చైనీస్) కూడా వాడుకలో ఉంది. ఇక్కడ ఆడామగా అందరూ సిగరెట్లు విపరీతంగా తాగుతారు.

వెనీషియస్ క్యాసినో అందాలు...

మకావు అంటే ముందుగా గుర్తొచ్చేది కేసినోలు. ఇక్కడి విలాసవంతమైన జీవితం, హోటళ్లు, కేసినోలు... వీటివల్లే దీనికి 'లాస్ వేగాస్ ఆఫ్ ఏషియా' అన్న పేరు వచ్చింది. రంగురంగుల అద్దాలు,



అందమైన ఫర్నిచరూ, కళ్లు మిరుమిట్లు గొలిపే లైట్లూ... వీటి మధ్య కొన్ని లక్షలు పెట్టి ఆడే ఆటలు... ఇవన్నీ కేసినోల్లో అడుగడుగునా ఆకర్షించే అందాలు. గెలాక్సీ, లిస్బోవా, మాండరిన్ ఓరియంటల్, ఫారోస్ ప్యాలెస్, శాండ్స్ మకావు, క్యాసినో ప్యాలెస్, వెనీషియన్... ఇవన్నీ ప్రఖ్యాతిగాంచిన కేసినోలే... ఇందులో క్యాసినో ప్యాలెస్‌ని షిప్పులో నిర్వహిస్తారు.

వెనీషియన్ క్యాసినో ప్రపంచంలోనే అతిపెద్ద క్యాసినోల్లో రెండో స్థానంలో ఉంది. ఈ కేసినోలో మూడువేల గదులున్నాయి. ఇక్కడ సుమారు 50 వేలమంది కూర్చుని ఆడుకోవచ్చు. ఈ భవనంలో ఫెంగ్‌షుయి పద్ధతి ఎక్కువగా కనిపిస్తుంది. ఇందులో 20 ఫైన్ డైన్ రెస్టారెంట్లు, కెఫేలు ఉన్నాయి. షాపింగ్‌మాల్స్, స్పాలు కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడి చాలా ప్రదేశాలు, విగ్రహాలు వెనిస్ నగరంలో వాటిలా కనిపిస్తాయి. ఇందులో మొత్తం 350 షాపులున్నాయి. కేసినో లాబీ సీలింగ్ అంతా రోమన్ చరిత్రకు సంబంధించిన బొమ్మలతో నిండి ఉంటుంది. షాపింగ్ కాంప్లెక్సులున్న ఫ్లోర్‌లో నిలబడి పైకి చూస్తే 'ఇదేంటి ఆకాశం కనిపిస్తోంది!' అని అనుకుంటారు. అంతబాగా పై కప్పును డిజైన్ చేశారు. 'అబ్బ! ఎంత అద్భుతంగా వుంది!' అనుకునేలోగా మరో వింత కనిపిస్తుంది. అదేంటంటే... ఉదయం, సాయంత్రం, రాత్రి వేళలకు అనుగుణంగా ఆ సీలింగ్ మారిపోతుంటుంది.

18 ఏళ్లు నిండినవారికే కేసినోవాల్లో ఆడేందుకు అనుమతి లభిస్తుంది. ఇంకో ముఖ్యమైన, చిత్రమైన విషయం ఏంటంటే... స్థానిక ప్రభుత్వాధికారులను వీటిలోకి అనుమతించరు. చైనా న్యూ ఇయర్ మొదటి మూడు రోజులు మాత్రమే వారి ప్రవేశానికి అనుమతి లభిస్తుంది.

ఎంత పెద్ద టవరో!

సిటీలో ప్రధాన ఆకర్షణ... మకావు టవర్. దీని ఎత్తు 330 మీ. ఇది ప్రపంచంలోని ఎత్తైన టవర్లలో పదో స్థానంలో ఉంది. దీని చివరి భాగానికి చేరుకోడానికి లిఫ్ట్ ఉంది. అక్కణ్ణుంచి చూస్తే సుమారు 55 కిలోమీటర్ల మేర మకావు నగరమంతా కనిపిస్తుంది. టవర్‌కి ఒకవైపంతా నది కనిపిస్తుంది. వెనీషియన్ కేసినోలో సీలింగ్ ఎంత అందంగా కనిపిస్తుందో, ఈ టవర్‌లో ఫ్లోరింగ్ కూడా అంత బావుంటుంది. అక్కడక్కడా ట్రాన్స్‌పరెంట్ ఫైబర్ గ్లాస్ వేశారు. నడుస్తూ నడుస్తూ ఒక్కోసారి కిందికి చూస్తామా... అంతే! 'అమ్మో కిందికి పడిపోతున్నాం' అని దడుసుకోవడం ఖాయం. కింద వెళ్తున్న వాహనాలను చూస్తే వాటిమీద ఎక్కడ పడిపోతామేమోనని వెన్నులో వణుకుపుట్టాల్సిందే.

సైవాన్ బ్రిడ్జి

ఇది కోల్‌కతా హౌరాబ్రిడ్జిలా ఉంటుంది. సుమారు రెండున్నర కిలోమీటర్లుండే ఈ బ్రిడ్జి తైపా అనే ఊరిని మకావుని కలుపుతుంది.

ఇంకా...

మకావులో సాంస్కృతిక కార్యక్రమాలు, రకరకాల ప్రదర్శనలు ఎక్కువగా జరుగుతుంటాయి. అందుకే వాటికోసం ప్రత్యేక ప్రాంతాలను ఏర్పాటు చేశారు. అలాంటి వాటిలో సెనడో స్క్వేర్ ముఖ్యమైనది. ఇక్కడ గ్రౌండంతా పాలరాతితో చేసిందే. వీధుల్లో చాలా పెద్ద మ్యూజియాలూ, ఆడిటోరియాలూ ఉన్నాయి. అన్నీ చైనీస్-పోర్చుగీసు కలిసిన శైలిలో ఉంటాయి. పర్యాటకులు ఇక్కడి కాఫీ షాపుల్లో కూర్చుని ప్రదర్శనలూ, కార్యక్రమాలూ చూస్తుంటారు.

హాంకాంగ్‌లో డిస్నీల్యాండ్, బుద్ధుని ఆలయాలూ, చారిత్రక ప్రదేశాలూ.. ఇలా చూడాల్సినవి చాలా వున్నాయి.

ఎలా వెళ్లాలంటే...

హాంకాంగ్, మకావులను చూసేందుకు నాలుగు, అయిదు రోజుల ట్రిప్పులున్నాయి. వీలుంటే అక్కడ్నుండి థాయ్‌లాండ్ కూడా చూసి రావచ్చు. మకావు వెళ్లడానికి మన దేశం నుండి నేరుగా విమానాలు లేవు. హాంకాంగ్ వెళ్లి అక్కడ్నుండి వెళ్లాల్సిందే. హాంకాంగ్ నుండైతే విమానాలు, చిన్న సైజు పడవల్లాంటి ఫెర్రీలు ఉంటాయి. ఫెర్రీలో తాగడానికి, తినడానికి అన్నీ దొరుకుతాయి. హార్బర్‌కి వెళ్లేటప్పుడు ఇమ్మిగ్రేషన్, వీసా చెకప్ ఉంటాయి. వీసాను అక్కడికక్కడే ఇస్తారు.



కేసినో లోపలి భాగం...



హాంకాంగ్‌లో డిస్నీల్యాండ్

మకావులో త్రీస్టార్ నుండి సెవెన్ స్టార్ వరకూ అన్ని రకాల హోటళ్లూ ఉంటాయి. మూడు నుండి ఐదు వేల రూపాయలు పెట్టగలిగితే సౌకర్యవంతమైన సింగిల్ రూములు దొరుకుతాయి.

అసలు కథంతా....

మకావులో మకనీస్ భోజనం చేసి, పోర్చుగీస్ వైన్ రుచి చూడడానికి పర్యాటకులు చాలా ఆసక్తి చూపుతారు.

మకావు అందాన్ని చూడాలంటే రాత్రిపూటే చూడాలి. అసలు కథంతా రాత్రే మొదలవుతుంది. 24 గంటలు పనిచేసే హోటళ్లు, క్లబ్బుల్లో పోల్ డ్యాన్సులు, కేసినోలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుద్దీపాల వెలుగులో మెరిసిపోయే సిటీ అందాలు... అన్నీ రాత్రిపూటే చూడాలి. అర్ధరాత్రిళ్లు కూడా ఎలాంటి ఇబ్బందులూ తిరిగి చూడొచ్చు. పూర్తి రక్షణ ఉంటుంది. ★




తైపా అనే ఊరిని మకావుని కలిపే సైవాన్ బ్రిడ్జి

నెత్తు'రోడ్డు'తోంది!

- మహ్మద్ సుల్తాన్ అహ్మద్

అవి వాహనాలు కావు! మృత్యు శకటాలు! వాటి మూలంగా కన్నవారికి బిడ్డలు మిగలడంలేదు. బిడ్డలకు తల్లిదండ్రులు దక్కడంలేదు. కొత్త పెళ్లి కూతురుకు పెళ్లికొడుకు దూరమౌతున్నాడు. చివరికి ఆ పెళ్లికి అక్షింతలు వేయడానికి, మంగళ వాయిద్యాలు వాయించడానికి వచ్చిన బంధువులూ, బ్యాండుమేళంవారూ దూరమౌతున్నారు. రోడ్లమీద మృత్యుశకటాల మరణమృదంగంతో నిత్యం ఎక్కడోచోట రక్త తర్పణం జరుగుతూనే వుంది. అనియంత్రిత వేగం, అజాగ్రత్త, మద్యం కిక్కు, గతుకులు-గుంతల రోడ్లు, కాలం చెల్లిన వాహనాల వల్ల రోడ్లు నెత్తురోడుతున్నాయి. వాహనాల మధ్య నలిగి కొస ప్రాణాలతో చేస్తున్న జన ఘోష [illegible] చెవులకు సోకడం లేదు. దుర్ఘటన జరిగాక సాధ్యమైనంత త్వరితంగా వైద్యం అందుతుందా అంటే అనుమానమే! రోడ్డు ప్రమాదాలపై కాసిని జాగ్రత్తలే కరవౌతున్నాయి. సర్కారూ నిద్ర మత్తులో జోగుతోంది. రవాణా పోలీసు శాఖల మధ్య సమన్వయమే లోపిస్తోంది. రాష్ట్రంలో నానాటికి పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలపై ఈ వారం అట్టమీది కథనం...

బయటికి వెళ్లినవారు ఇంటికి తిరిగి వచ్చేవరకూ బిక్కుబిక్కుమంటూ ఎదురుచూడాల్సి వస్తోంది. త్వరితగతిన గమ్యస్థానాలకు చేరుకోవాలన్న తొందర... మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం... మద్యం మత్తులో భారీ వాహనాలు నడపడం... నిద్ర మత్తులో జోగుతూ ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టడం వంటి సంఘటనలతో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదం జరగని రోజంటూ లేదు. జాతీయ రహదారులూ, రాష్ట్ర రహదారులన్న బేధం లేకుండా మృత్యువు వెంటాడుతోంది. రాష్ట్రంలో ఏ రహదారులు చూసినా రక్తసిక్తం అవుతున్నాయి.

నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల సంఖ్యను చూస్తే గుండె జారిపోవాల్సిందే. జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్‌సిఆర్‌బి) తాజా గణాంకాల ప్రకారం దేశంలో ప్రతి గంటకు 30 నుంచి 40 మంది రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతుంటే ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి యేటా సగటున 12 నుండి 13 శాతం మంది ప్రాణాలు ఒదులుతున్నారు. మహారాష్ట్రలో 10 నుంచి 11 శాతం, తమిళనాడులో 10.8 శాతం మరణాలు సంభవిస్తున్నట్లు గణంకాలు తెలుపుతున్నాయి. అంటే ఈ లెక్కన రోడ్డు ప్రమాదాల్లో మన రాష్ట్రమే అగ్రస్థానంలో ఉందని స్పష్టంగా తెలుస్తోంది. రోడ్లపై నడిచే పాదచారులు, సైకిలిస్టులు, ద్విచక్ర వాహనదారులు కలిపి 85 శాతం మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. మన దేశంలో 2002లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 86,674 మంది చనిపోగా 2007లో ఈ సంఖ్య లక్షా14,444కి పెరిగింది. 2008లో లక్షా18వేలగా ఉంది. 2009లో 98, 161 మంది మరణించగా, 2010లో లక్షా 28, 404 మంది చనిపోయారు. రోడ్డు ప్రమాదాల బాధితుల కోసం స్థూల జాతీయోత్పత్తిలో 3 శాతం మేర (55 వేల కోట్లు) ఖర్చవుతున్నట్లు మన ప్రణాళికా సంఘం 2002లో అంచనా వేసింది. రోడ్డు ప్రమాదాల కారణంగా సంభవిస్తున్న మరణాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఇంటి ముందు నిలబడాలన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడబోతుందన్న ఆందోళన కూడా వ్యక్తం చేసింది.

భద్రతా ...ఎక్కడా...!

'అసలు రోడ్లు సరిగ్గా వుంటే ఇన్ని యాక్సిడెంట్లు జరక్కపోవు' అనేవారూ లేకపోలేదు. రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బి) అధీనంలో 65 వేల కిలోమీటర్లు, జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో 4 వేల కిలోమీటర్ల రహదారులున్నాయి. ఆర్ అండ్ బి రోడ్ల విస్తరణకు ఏటా కనీసం రూ.5 వేల కోట్ల నిధులను కేటాయించాలని అధికారులు కోరుతున్నా బడ్జెట్‌లో రూ.2500 కోట్లకు మించడం లేదు. దీంతో 15 వేల

కిలోమీటర్ల రహదార్లు గోతులతో మరమ్మతులకు నోచుకోకుండా పడివున్నాయి. దాంతో వాహనాలు తిరగడానికి లేకుండా వుంది. రాష్ట్రంలో జాతీయ రహదారుల పరిస్థితీ ఇందుకు భిన్నంగా ఏం లేదు. పోలీసు శాఖ మూడేళ్ల కిందటే సర్వే చేసి రాష్ట్ర వ్యాప్తంగా 500 ప్రమాదకరమైన రోడ్డు మలుపులను గుర్తించింది. అక్కడ జరిగే దుర్ఘటనల్లో కనీసం ఐదారు వేల మంది చనిపోతున్నారని నిర్ధారించింది. తర్వాత కూడా ఆ రోడ్డు మలుపులను విస్తరించిన పాపానపోలేదు. ప్రమాదాలను నివారించడానికి ఏటా రు.200 కోట్ల రూపాయల వరకూ అవసరమని అధికారులు చెబుతున్నారు. కానీ వాటికి అందే నిధులకు... అవసరాలకు... పొంతనే లేకుండా పోయింది. ఇక జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. 'జాతీయ రహదారుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ మండలి' పేరుతో మండలిని ఏర్పాటు చేసింది. ఆటోమొబైల్ ఇంజనీరింగ్, రోడ్డు ప్రమాదాల విశ్లేషణ, ట్రాఫిక్ నిర్వహణ, ట్రామాకేర్ రంగాల్లో అనుభవజ్ఞులైన అయిదుగురు సభ్యులతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. రహదారి భద్రతలో అనుభవం ఉన్న వ్యక్తిని మండలి ఛైర్‌పర్సన్‌గా నియమించింది. 31 మందితో సలహా కమిటీని ఏర్పాటు చేసింది. అయితే ఆ సభ్యులెవరో ఇంత వరకు తెలియదు. రాష్ట్రంలో ఇన్ని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఇంత వరకు భద్రతా మండలికి చెందిన సభ్యులెవరూ దరిదాపుల్లోకి వచ్చిన దాఖలాలు లేవనే చెప్పాలి. ఈ భద్రతా కమిటీ సభ్యులు రోడ్డు భద్రతపై కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాల్లో లోటుపాట్లను సవరించి సవరణలను చేస్తారని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసే సమయంలో మండలిని సంప్రదించి సలహాలు తీసుకోవాల్సి ఉంటుందని అప్పట్లో నిర్ణయం తీసుకుంది. రహదారుల్లో ప్రమాదాల నివారణకు

అవసరమైన చర్యలను ఈ మండలి తీసుకుంటుందని కూడా తెలిపింది. అంతేకాకుండా వివిధ కంపెనీల వాహనాల తయారీ, డిజైన్ రూపకల్పన దగ్గర నుంచి రహదారుల నిర్మాణం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి అంశాలన్నీ మండలి పరిశీలిస్తుందని ప్రకటించింది. వాహనాల తయారీలో కనీస భద్రతా ప్రమాణాలను సూచించడంతో పాటు వాహనాన్ని జాగ్రత్తగా ఉపయోగించేందుకు కనీస ప్రమాణాలు, సలహాలు ఇవ్వడంతో పాటు వాహనం మోసుకుపోగలిగిన బరువుకు గరిష్ఠ పరిమితిని కూడా ఈ మండలి సభ్యులు నిర్ణయిస్తారు. నాసిరకంగా ఉండే రహదారులు కూడా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతన్నాయన్న సంగతి తెలిసిందే. అందుకే జాతీయ రహదారుల నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ప్రమాణాలను మండలి సూచనలు చేస్తుంది. కేంద్రం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల మేరకు నిర్మాణాలు కొనసాగుతున్నాయా లేదా అన్న అంశాలను కూడా మండలి పరిశీలించాలి. ఇదిలావుండగా ప్రమాదాలకు ఆస్కారం లేని వాహనాల డిజైన్లను ప్రోత్సహించడం, రహదారుల నిర్మాణాన్ని పర్యవేక్షించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ కోసం మండలి ఒక కొత్త విధానాన్ని రూపొందించింది. జాతీయ రహదారుల్లో ఒక సమయంలో ఎన్ని వాహనాలు ప్రయాణించవచ్చు అన్న అంశం దగ్గర నుంచి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అన్ని ప్రమాణాలను రూపొందించింది. వేగం ఆధారంగా వాహనాలను విభజించి ప్రయాణించాల్సిన మార్గాలను నిర్ణయించింది. ఇక ఆంధ్రప్రదేశ్ రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం 'రోడ్ సేఫ్టీ అథారిటీ'ని ఏర్పాటైతే చేసింది. ఈ అథారిటీకి సీనియర్ ఐపిఎస్ అధికారికి (ఆంజనేయరెడ్డి) ఛైర్మన్ పదవినీ అప్పగించింది. ఆయన ఛైర్మన్‌గా పనిచేసింది కొద్ది నెలలే అయినప్పటికీ ప్రమాదాల నివారణకు కొద్దిపాటి చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత బాధ్యతలకు వచ్చిన ఎంవి కృష్ణారావు కొంత కాలం పనిచేసి మరో శాఖకు మారారు. అనంతరం ఎ.కె.మహంతిని నియమించారుగానీ...ఆయన కొంత కాలమే పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత నుంచి ఛైర్మన్ కుర్చీ ఖాళీగా పడివుంది. దాంతో అప్పట్లో ప్రభుత్వం చెప్పినవన్నీ అటకెక్కాయి.

పత్తాలేని రక్షక వాహనాలు

ప్రమాదాల నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు భారీ స్థాయిలో రచించింది. కానీ ఆచరణకు నోచుకున్నవి మాత్రం చాలా తక్కువే అని చెప్పుకోవాలి. ప్రతి పది కిలోమీటర్లకు ఒకటి చొప్పున అంబులెన్స్, మెడికల్ మొబైల్ వాహనం ఏర్పాటు, ప్రమాదాలు సంభవించినప్పుడు రోడ్డుపై అడ్డంగా పడివున్న వాహనాలను పక్కకు తొలగించేందుకు ప్రతి 50 కిలో మీటర్లకు ఒకటి చొప్పున క్రేన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అప్పట్లో సంకల్పించింది. ఫలితాలు రావాలంటే సంకల్పాలు మాత్రమే చాలవుకదా. దాన్ని చిత్తశుద్ధితో ఆచరించాలిగా! ఇక డ్రైవింగ్ స్కూళ్ల సంగతి! రాష్ట్రంలో 240 వరకూ డ్రైవింగ్ స్కూళ్లున్నాయి. రవాణా వాహనం నడపడానికి లైసెన్స్ తీసుకోవాలంటే సదరు వ్యక్తి తప్పనిసరిగా డ్రైవింగ్ స్కూల్లో నెల్లాళ్లపాటు శిక్షణ తీసుకోవాలి. ఆ విధంగా ధృవీకరణ పత్రం కూడా వుండాలి. మన రాష్ట్రంలో అనేక డ్రైవింగ్ స్కూళ్లలో కనీస వసతులు లేకుండానే, సరిగా శిక్షణ ఇవ్వకుండానే ధృవీకరణ పత్రాలిస్తున్నట్లు రవాణా





శాఖ అధికారులు గుర్తించారు. చాలాచోట్ల ఇటువంటి నకిలీలు ఎందరో రవాణాశాఖ అధికారుల నుంచి భారీ రవాణా వాహనాలను నడిపే లైసెన్సులు పొందుతున్నారు. లారీల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అందువల్ల లారీల్లో ప్రయాణీకుల తరలింపును కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. మూడు చక్రాల ఆటోలు జాతీయ రహదారులపై నడపకుండా నిషేధించారు. ఏడు సీట్ల ఆటోల్లో పది నుంచి పదిహేను మంది వరకూ ఎక్కించుకొని జాతీయ రహదారుల్లో నడపడం వల్ల కూడా రోడ్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. పరిమితిని మించి ప్యాసెంజర్లను కుక్కుతూనే వున్నారు. నిషేధాలేవీ అమలు కావడంలేదు.

ఉత్తుత్తి మాటలేనా!

జాతీయ రహదారుల వెంట ప్రతి 80 కిలోమీటర్లకు ఒక హోటల్‌తో పాటు విశ్రాంతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ ప్రతిపాదించింది. దీనివల్ల డ్రైవర్లతోపాటు ప్రయాణికులు కూడా విశ్రాంతి తీసుకోవడానికి అవకాశం వుంటుందన్నది భావన. అదింత వరకు ఆచరణలోకి రాలేదు. మద్యం తాగి భారీ వాహనాలు నడిపే డ్రైవర్లను గుర్తించేందుకు 'బ్రీతింగ్ అనలైజర్లు' కొనుగోలు చేయాలని కూడా ప్రభుత్వం భావించింది. వీటి కొనుగోలుకు రోడ్ సేఫ్టీ అథారిటీకి భారీగా నిధులు కేటాయించింది. కానీ ఇప్పటి వరకు నామమాత్రంగానే బ్రీతింగ్ అనలైజర్లను కొనుగోలు చేసింది. అసలు విశ్రాంతి గదుల నిర్మాణమే చేపట్టలేదు. తక్కువ సంఖ్యలో మొబైల్ వాహనాల కొనుగోలు చేసి అక్కడక్కడ నాలుగైదు పెట్టి చేతులు దులుపుకుంది. ఇక అంబులెన్స్‌ల ఊసే లేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడే ఏర్పాటు చేసిన 108లే దిక్కుగా మారాయి. ఇదిలావుండగా రాహదారుల్లో ప్రతినిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించేందుకు రోడ్డు సేఫ్టీ అథారిటీ వద్ద అత్యాధునిక సమాచార వ్యవస్థ ఉన్నప్పటికీ అంబులెన్స్‌లను ఘటనా స్థలానికి రప్పించేందుకు చాలా సమయం పడుతోంది. దీంతో పాటు మెడికల్ మొబైల్ వాహనాల సంఖ్య కూడా తక్కువగా ఉండటం వల్ల క్షతగాత్రులకు సత్వరమే వైద్య సేవలు అందించడంలో జరుగుతున్న జాప్యం వల్ల అనేక మరణాలు సంభవిస్తున్నాయి. సకాలంలో వైద్య సేవలు అందక పోవడం వల్ల ప్రమాదాల్లో గాయపడ్డ వారు తీవ్ర రక్తస్రావమై మరణిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. గాయపడ్డ వారికి ప్రాథమిక చికిత్స సత్వరమే అందితే 50 శాతం మరణాలను నియంత్రించవచ్చని వైద్యుల చెబుతున్నారు. అంతేకాకుండా జాతీయ రహదారులు, జిల్లా ప్రధాన రహదారి వెంబడి మద్యం దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఏటా వీటి సంఖ్య పెరుగుతోందే కానీ తరగడంలేదు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జాతీయ రహదారుల వెంబడి వెయ్యికి పైగా దుకాణాలున్నాయి. కాకపోతే వీటిపై చర్యలు తీసుకున్నదే లేదు. వాహనదారులు ఎక్కడంటే అక్కడ బళ్లు ఆపుకొని మద్యం సేవించి మత్తులో జోగుతూ ప్రమాదాలకు కారణమౌతున్నారు.

ఏ వాహనానికైనా అవే రోడ్లు

రాష్ట్రంలో రోడ్డు విస్తరణ అంతంత మాత్రంగానే నడుస్తోంది. ప్రధాన రహదారులు దశాబ్దం కిందట ఎలాగున్నాయో ఇప్పటికీ అదే రీతిలో వున్నాయి. పైగా గంటకు 140 మీటర్ల వేగంతో నడిచే దేశీయ విదేశీ కంపెనీల వాహనాలు ఇప్పుడు మార్కెట్‌లోకి వచ్చాయి. ఎప్పటికప్పుడు కొత్త కొత్త మోడళ్ల వాహనాలను ఉత్పత్తి చేస్తుండటంతో ప్రతి ఏటా భారతదేశంలో 11 నుంచి 12 శాతం నాలుగు చక్రాల వాహనాలు, 10 నుంచి 12 శాతం చొప్పున ద్విచక్ర, ఏడు శాతం చొప్పున ఆరు, ఎనిమిది చక్రాల వాహనాలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం చెబుతున్న ఈ గణంకాలు నిజమేనా అన్న అనుమానం ఉన్నప్పటికీ ప్రతినిత్యం కనీసం 65 నుంచి 75 శాతం వాహనాలు రోడ్లపై తిరుగుతూ ఉంటాయని భావించవచ్చు. ఇక వాహనాల అమ్మకాలకు సంబంధించిన గణంకాలను పరిశీలించినా వాహనాల పెరుగుదల శాతం 12 నుంచి 14 శాతం ఉంటుంది. వాటికి అనుకూలంగా రోడ్లు మాత్రం మారలేదు. 1997-2003 మధ్య కాలంలో ప్రతి పది లక్షల మందికి 80 నుంచి 82 శాతం ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 2007 వచ్చే సరికి వీటి సంఖ్య 101కు చేరుకుంది. గత కొన్నేళ్లుగా రోడ్డు ప్రమాదాలకు అనేక మంది అమాయకులు బలవుతున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచిందని జాతీయ నేర నమోదు సంస్థ తాజా గణాంకాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయ వేసినప్పటికీ ఏదో కంటి తుడుపు చర్యగా నివారణ చర్యలు చేపడుతున్నామంటూ ప్రకటించింది. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయాల్సిందిగా పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించింది. పోలీసు విభాగం రంగంలోకి దిగి ఏ జిల్లాల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయో అధ్యయనం చేసింది. అంత వరకు బాగానే ఉంది. కానీ ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. ఎక్కడో పెద్ద ప్రమాదం జరిగితే తప్ప ప్రమాదాల నివారణా చర్యలు గుర్తుకురావు. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల తరహాలో డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని చేపడితే 80 శాతం ఫలితాలు సాధించుకోవచ్చని కొన్ని నెలల క్రితం ఆ కోణంలో ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే ఇది కాగితాలకే పరిమితమైంది. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇప్పటికే రాష్ట్ర రోడ్డు సేఫ్టీ అథారిటీ పనిచేస్తున్నప్పటికీ ఆశించినంత ఫలితాలు రావడంలేదు. కొత్తగా డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ అథారిటీ ఏర్పాటు చేస్తే ఏమేరకు ఫలితాలు సాధిస్తుందో వేచి చూడాల్సిందే.

రాష్ట్రంలో మరణమృదంగం

సంవత్సరం	మరణాలు	గాయపడ్డవారు
2001	8,248	37,931
2002	9,532	46,816
2003	9,590	47,545
2004	10,621	53,898
2005	11,098	53,666
2006	12,606	59,453
2007	13,175	26,322
2008	14,529	64,526
2009	14,799	59,561
2010	14,300	52,550
2011 మార్చి 31 వరకు	150కి పైగా	950

వాహనదారులు...వ్యక్తిగత చైతన్యం

డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ అథారిటీ ఏర్పాటు చేసినంత మాత్రాన ప్రమాదాలు నివారించలేమని ప్రభుత్వం భావించింది. అందుకే గ్రామస్థాయిలో వాహనదారుల్లో చైతన్యం తీసుకురావాలని, అప్పుడే అనుకున్న ఫలితాలు సాధించవచ్చన్న నిర్ణయానికి వచ్చింది. ఇంత వరకు బాగానే ఉంది కానీ అచరణలో ఫలితం శూన్యం. ఎందుకంటే డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ అథారిటీ ఏర్పాటు చేసినప్పటికీ నేటివరకు కూడా ఐజీని కానీ డీఎస్పీని నియమించలేదు. జాతీయ రహదారుల ప్రమాదాల నివారణకు ఐజీ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారని చెప్పింది. గ్రామస్థాయిలో ప్రమాదాల నివారణ, వాహనదారుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు డీఎస్పీ స్థాయి అధికారిని నియమిస్తున్నట్లు కేవలం ప్రకటన మాత్రమే చేసింది. ఈ పోస్టు కూడా భర్తీ కాలేదు. ఈ అథారిటీ ఏర్పాటు చేసేటప్పుడు అనేక నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రకటించింది. జిల్లాల్లో నియమించే డీఎస్పీ ప్రతి రోజూ ఏదో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఆయా గ్రామాల్లో రచ్చబండ వద్ద అవగాహన సదస్సులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా ప్రతి పోలీస్ స్టేషన్‌కు 'బ్రీతింగ్ అనలైజర్' అందజేయనున్నామని ప్రకటించింది. ఆయా పోలీస్ స్టేషన్లకు చెందిన ఇన్‌స్పెక్టర్, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎవరో ఒకరు ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో రోడ్లపై నిలబడి రోడ్డుపై వచ్చిపోయే వాహనాలను నిలిపి బ్రీతింగ్ అనలైజర్‌తో తనిఖీలు చేయాలని నిర్ణయించింది. డ్రైవర్ మద్యం సేవించి ఉంటే వాహనాన్ని అక్కడే నిలబెట్టించి చలానుతో పాటు అతనికి కౌన్సిలింగ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకునేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. నెల రోజుల్లో ఇలా నాలుగైదు సార్లు మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే డ్రైవర్ లైసెన్సు రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇంత వరకు డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ అథారిటీ ఏర్పాటు చేయలేదంటే ప్రభుత్వ చిత్తశుద్ధి ఎలాంటిదో అర్థం అవుతోంది. డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ అథారిటీ ఏనాటికి ఏర్పాటవుతుందో ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. అంతేకాదు! ఆ మధ్య నిబంధనలను ఉల్లంఘించిన వారిని ప్రాసిక్యూట్ చేసే అధికారాన్ని సబ్‌ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారికి ఇస్తూ ప్రభుత్వం రవాణా చట్టంలో మార్పు కూడా చేసింది. అధికారులు పెద్దగా శ్రద్ధ పెట్టకపోవడంతో దీనివల్ల పరిస్థితిలో అంతగా మార్పు రాలేదు.

వేగానికి పగ్గాలు!

ప్రతి వాహనానికి వేగ నియంత్రణ వుండాలని కేంద్రం ఆదేశించింది. లారీల వంటి భారీ వాహనాలు 50 కిలోమీటర్ల వేగానికి మించి ప్రయాణించకుండా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కానీ లారీ యజమానుల సంఘం దీన్ని తీవ్రంగా వ్యతిరేకించడంతో ఆ ఆలోచన నుంచి వెనక్కి తగ్గింది. కానీ అందుకుగాను ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలూ చేపట్టలేదు. దాంతో ప్రయివేటు వాహనాల వేగానికి హద్దే లేకుండాపోయింది. జాతీయ రహదారుల్లో మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నట్లు రోడ్ సేఫ్టీ అథారిటీ గుర్తించింది. అయితే పక్క రాష్ట్రాల తరహాలో వాహనాల వేగాన్ని గుర్తించే 'రాడార్ వెకౌంటెడ్ వెహికల్' లను అందజేయాలని చాలా కాలాంగా ప్రభుత్వానికి లేఖలు రాస్తూనే ఉంది. మూడేళ్ల క్రితం ఒక్కటి మాత్రమే అందజేసిన ప్రభుత్వం ఆ తర్వాత ఈ విషయాన్ని పట్టించుకోవడం మానేసింది. వాహనాలను కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించాలని ఎన్ని లేఖలు రాసినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఉన్న ఈ ఒక్క వాహనాన్ని రోడ్ సేఫ్టీ అథారిటీ అధికారులు 7, 9వ నెంబర్ జాతీయ రహదారుల్లో అటు ఇటూ తిప్పుతున్నారు. ఒక్క రాడార్ వెకౌంటెడ్ వెహికల్‌తో ప్రమాదాలను అరికట్టడం సాధ్యం కాదని అథారిటీ సభ్యులు కూడా ఫీల్డుకు వెళ్లడం మానేశారు. అంతెందుకు నిధులు లేని సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ పదవిలో పనిచేసేందుక ఏ ఐపిఎస్ అధికారి కూడా ముందుకు రావడంలేదు. చాలా కాలాంగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. జాతీయ రహదారుల్లో స్లోమోషన్ వెహికల్స్ (ఎద్దుల బండ్లు, తోపుడు బండ్లు, రిక్షాలు) వంటి వాహనాలను నిషేధించడంతోపాటు మూడు చక్రాల వాహనంలో (ఆటోల్లో) సామర్థ్యానికి మించి ప్రయాణీకులను ఎక్కించకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి వాహనానికి హెడ్‌లైట్లు తప్పనిసరిగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని, వీటిని స్థానిక పోలీసులు, ఆర్టీఏ అధికారులు పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ముందుగా ఆలోచించింది. రాష్ట్ర ప్రభుత్వం 37 వేల పోలీసు నియామకాల్లో ఎంపిక చేసిన చురుకైన కొంత మంది సిబ్బందిని ట్రాఫిక్ విభాగంలో నియమించాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ★



కథ

పాపమ్మ



- పుప్పాల కృష్ణమూర్తి

ఆఫీసుకెళదామని బస్టాండుకొచ్చాను. "బాగున్నావా కిష్టయ్యా" అన్న పిలుపు వినబడ్డంతో పక్కకు తిరిగి చూశాను. పాపమ్మ. బాగా చిక్కిపోయి, చింపిరి తలతో ఉంది. ఒంటి మీద చీర, జాకెట్టు చాలా చోట్ల చిరిగుంది. కళ్లల్లో దైన్యం... ముఖం మసకబారినట్లుంది. అరవయ్యేళ్ల వృద్ధాప్యాన్ని మోస్తూ దయనీయంగా కనిపించింది.

"ఏంటి పెద్దమ్మా ఇక్కడున్నావ్" అన్నాను.

"ఊళ్లో నెగల్నియ్యట్లేదు కొడకా. తినే కంచం, కట్టుకునే బట్టలు కూడా ఊడబీక్కుని వెళ్లగొట్టింది కోడలు. నోరుబట్టని కూతలు కూసింది. అందుకే ఇక్కడికొచ్చి అడుక్కుంటున్నా. సక్కదనాల ముసలోడ్ని తీసకపోయిండు దేవుడు. నన్ను దీసకబోడాయె" అంది కన్నీరు పెట్టుకుంటూ.

నాకు చాలా బాధేసింది. 'మా వూళ్లో, మర్యాదగా బతికిన పాపమ్మ ఇలా బజార్నపడుద్దని ఎవరనుకున్నారు?'

వెంటనే జేబులోంచి పది రూపాయల నోటు తీసి చేతిలో పెట్టి "దిగులు పడకు. ఈ సారి ఇంటికి పోయినప్పుడు బ్రహ్మాచారితో మాట్లాడి రమ్మని చెబుతాలే" అన్నాను.

"వద్దులే కొడకా. వాడొచ్చి నాతో మాట్లాడిండని తెలిస్తే రాసి రంపాన పెట్టుద్ది. పెళ్లం కాడ్నే ఉండనీ. దాన్నే జయం గానీ" అంది ముక్కు చీదుకుంటూ.

ఇంతలో సూర్యాపేట బస్సు రావడంతో "వస్తా పెద్దమ్మా" అని చెప్పేసి బస్సెక్కాను. కిటికీ పక్కన కూర్చున్నాను. ప్లాట్‌ఫాంపై నిలబడ్డ వాళ్లముందు చేయిచాచి అడుక్కుంటోంది. చెప్పలేని బాధ ఏదో గుండెను పిండేస్తోంది.

మా ఇంటికి రెండిళ్లవతల్నే పాపమ్మ ఇల్లు "అక్కా పాలు పిండినవా. మీ అన్నకు టీ పడందే బాడిశ లేవదు" అంటూ గ్లాసు తీసుకుని పొద్దు పొడవకముందే అమ్మ దగ్గరకు వచ్చేది.

పాపమ్మ పెనిమిటి పొద్దు పొడిచిందగ్గర్నుండి పొద్దుగూకేదాకా పని చేసేవాడు. చేతినిండా నాగళ్లు చేసే పనుండేది. ఎప్పుడూ వాళ్లింటిముందున్న వేపచెట్టు కింద పది మంది రైతులు కూర్చొనేవారు. పంటల గురించి, పడుచు పిల్లగాళ్ల గురించి మాట్లాడుకునేవారు. ఆ వాకిలి మహా సందడిగా ఉండేది. ఏడాది పాటు పని చేయించుకున్నందుకు ఊళ్లోని రైతులు వేసంగి కల్లాల మీదే ధాన్యం కొలిచేవారు. తినంగ, చేయంగ ఇంకా ధాన్యంగింజలు మిగిలేవి.

పటేలు సీతారామయ్యకు నాగలి చెక్కుతుంటే కండ్లు తిరిగినట్టై పెద్ద బాడిశ పట్టుతప్పి కుడి కాలు మీద పడింది. అసలే ఎలిగారం వేసి సానరాయి మీద రుద్దిందాయె. సగం కాలు తెగిపోయి ఎముక బైటికి వచ్చింది. ఆర్.ఎం.పి డాక్టర్ రామబ్రహ్మమొచ్చి సెప్టిక్ ఇంజక్షనిచ్చి కట్టు కట్టాడు. దెబ్బ మానేందుకు, నొప్పులకు మందులు ఇచ్చి వెళ్లాడు. కానీ నెలైనా పుండు మానలేదు. అనుమానమొచ్చి పట్నం డాక్టర్ దగ్గరికి వెళ్లాడు. షుగరు బైట పడ్డది. అప్పటికే కాలు లోపలిపొర తెగతినడం మొదలుపెట్టింది. వెంటనే జిల్లా ఆసుపత్రికి పోకుంటే ప్రాణానికే ముప్పన్నారు. తిండికని ఉంచుకున్న గింజల్ని షావుకారు చంద్రయ్యకు అమ్ముకుని డబ్బులు చేతపట్టుకుని వెళ్లారు. పరీక్షలన్నీ చేసి కాలు తీసేయాల్సిందేనని నిర్ధారించారు. మోకాలుకు రెండంగుళాల కింద వరకు తీసేశారు. జైపూరుకాలు పెట్టుకొమ్మని చెప్పారు డాక్టర్లు. కానీ డబ్బు లేక పోవడంతో చెక్కను తొలిచి కాలు అందులో ఇమిడేటట్లు చెక్కకాలు తయారు చేసుకున్నాడు. సపోర్టుగా కర్ర పట్టుకుని నడిచేవాడు. మళ్లీ బాడిశ పట్టుకుని చెక్కసాగాడు. కానీ ఒంటికాలు మీద భారం ఎక్కువ పడడంతో గతంలో మాదిరిగా ఎక్కువ సేపు చెక్కలేకపోయాడు. తనకు షుగరుందని తెలీడంతో దిగులు పట్టుకుంది. కల్లుబొట్టు తాగడం మానేశాడు. అన్నం కూడా తక్కువ తినడం మొదలుపెట్టాడు. దాంతో బాడిశ పట్టడానికి కావలసిన సత్తువ లేకుండా పోయింది. ఊళ్లో రైతులకు సమయానికి పనిముట్లు అందించలేకపోయాడు. దాంతో వారంతా అతనిమీద తగాదా పడి నాగాచారి వద్దకు వెళ్లడం మొదలుపెట్టారు. ఇక తప్పదనుకుని చదువు మాన్పించి కొడుకు చేతికి ఉలి, బాడిశ ఇచ్చాడు. బ్రహ్మాచారి రెండేళ్లల్లోనే పని మొత్తం నేర్చుకున్నాడు. కొడుకు పెద్ద పనిముట్లు చేస్తుంటే, తను బెజ్జాలు కొట్టడం, కూసాలు దింపడం వంటివి చేసేవాడు.

ఇంతలో ఉరుము లేని పిడుగులా ఊళ్లోకి వెంకటేశ్వరరావు దొరవారు ట్రాక్టర్ తీసుకొచ్చాడు. తన భూములు దున్నుకోడమే కాకుండా, కిరాయికి ఊళ్లో రైతుల భూములు కూడా దున్నడం మొదలుపెట్టాడు. దుక్కి దున్నడం, వరికోత, నూర్పుళ్లు ఇలా ప్రతిపనీ నాగలి, ఎడ్లు లేకుండా జరిగేది. తొందరగా పనవుతుండడంతో రైతులకు కూడా సుఖంగా ఉంది. అందరూ ట్రాక్టరుకు ఎగబడ్డారు. వీరాచారి ఇంటికి కట్టె పట్టుకుని వచ్చే రైతే కరువయ్యాడు. ఈ పరిణామం వీరాచారిని మరింత కుంగదీసింది. మనిషి జీవిత ఖైదుపడ్డ వాడిలా తయారయ్యాడు. పొద్దున్నే ఉలి, బాడిశ భుజాన పెట్టుకుని ఎవరింట్లో పనుందంటే వాళ్లింటికి వెళ్లి వాళ్లిచ్చిన పచ్చడో, పది రూపాయలో పటుకొచ్చేవాడు. ఊళ్లో పనుల్లేక పాపమ్మ కొడుకు బాడిశ పట్టుకుని పట్నం కూలికెళ్లడం మొదలుపెట్టాడు. ఉన్నట్టుండి ఒకరోజు వీరాచారి నిద్రలోనే కన్ను మూశాడు.

'పాపం. పనిలేక దిగులుతోనే పోయాడు' అనుకున్నారంతా.

భర్త పోయిన ఏడాది లోపు ఇంట్లో శుభకార్యం జరిపిస్తే మంచిదని పెద్దలు చెప్పారు. దాంతో కొడుక్కి పెళ్లి చేద్దామనుకుంది పాపమ్మ. పరాయి



నాగలి చెక్కుతుంటే కండ్లు తిరిగినట్టై పెద్ద బాడిశ పట్టుతప్పి కుడి కాలు మీద పడింది. అసలే ఎలిగారం వేసి సానరాయి మీద రుద్దిందాయె. సగం కాలు తెగిపోయి ఎముక బైటికి వచ్చింది. ఆర్.ఎం.పి డాక్టర్ రామబ్రహ్మమొచ్చి సెప్టిక్ ఇంజక్షనిచ్చి కట్టు కట్టాడు. దెబ్బ మానేందుకు, నొప్పలకు మందులు ఇచ్చి వెళ్లాడు. కానీ నెలైనా పుండు మానలేదు. అనుమానమొచ్చి పట్నం డాక్టర్ దగ్గరికి వెళ్లాడు. షుగరు బైట పడ్డది. అప్పటికే కాలు లోపలిపొర తెగతినడం మొదలుపెట్టింది. వెంటనే జిల్లా ఆసుపత్రికి పోకుంటే ప్రాణానికే ముప్పన్నారు. తిండికని ఉంచుకున్న గింజల్ని షావుకారు చంద్రయ్యకు అమ్ముకుని ఐదువేలు చేతపట్టుకుని వెళ్లారు. పరీక్షలన్నీ చేసి కాలు తీసేయాల్సిందేనని నిర్ధారించారు.

పిల్లయితే తనను చూడదని, తమ్ముడి బిడ్డనే మాట్లాడి చేసింది. కానీ ఆ కోడలు వెంకట నర్సమ్మకు నోరు పెద్దది. భర్త ఇంటికి రాగానే రోజూ అత్తమీద ఏదో ఒక ఫిర్యాదు చేసేది. బ్రహ్మచారికి పెళ్లాం చెప్పిందే వేదం. తల్లినే తిట్టేవాడు. దాంతో పాపమ్మకు ఇల్లు నరకప్రాయంలా తయారైంది. ఇంటెడు చాకిరీ నోరు మూసుకుని చేసినా కోడలు మెచ్చకపోయేది. కడుపు నిండా తిండి పెట్టేది కాదు. ఆకలికి తట్టుకోలేక రహస్యంగా తెలిసిన వాళ్ల ఇళ్లకి వెళ్లి అడుక్కుని తినేది పాపమ్మ.

ఒకనాడు గోవిందమ్మ ఇంట్లో అన్నం తింటుంటే కోంట లక్ష్మమ్మ చూసింది. "అయిన పిల్లవని కోడల్ని చేసుకుంటే పెద్ద వయసులో ఆ మనిషిని అట్ట కష్టాలు పెడతావా? ఆమె సొమ్ము దినుకుంటా కడుపు నిండా తిండి కూడా పెట్టవా?" అని చేతి పంపుకాడ నర్సమ్మను నిలదీసింది.

సాటివాళ్ల ముందు తన పరువు పోయిందని, ఇంటికొచ్చి శోకాలు పెట్టి ఏడ్చింది. "తల్లి కావాలో, నేను కావాలో తేల్చుకో" అని మొగుడు మీద యుద్ధానికి దిగింది.

అప్పటికే సగం చచ్చి బతుకుతున్న పాపమ్మ "ముగ్గురు పిల్లలయిన దానివి నువ్వెందుకు పోవడం. నేనే పోతున్నాలే" అని ఇంట్లోంచి వెళ్లి, వరుసకు కోడలైన ఈశ్వరమ్మ ఇంట్లో ఉంది.

కానీ అక్కడా ఉండనీయలేదు కోడలు. "ఊళ్లో అడుక్కుంటే నా పరువు పోవట్లా. నీ బిడ్డకాడికి పో. ఆమె సూత్తది" అని తగాదా వేసుకుని బట్టలమూట, తినే కంచం లాక్కుంది. నోరు పట్టని కూతలన్నీ కూసింది.

'బిడ్డ మాత్రం ఎందుకు చూస్తది. ఒక్కరోజు, రెండ్రోజులు... ఎల్లకాలం ఎలా చూస్తది? అల్లుడు ఏమైనా అనుకుంటాడు. ఒకనాటికైనా నా కొడుకే నా మీద ప్రేమతో తీసుకుపోడానికి రాడా' అనుకుంటూ కోదాడ చేరుకుని బజార్లవెంట, బస్టాండులో అడుక్కుంటూ బతుకీడుస్తోంది.

నేను మూడు రోజులపాటు అకౌంట్స్ ట్రైనింగు ఉండడంతో నల్లగొండ వెళ్లాను. ట్రైనింగ్ ముగించుకుని, మరుసటి రోజు ఆఫీసుకని, బస్టాండు లోపలికి వెళుతున్నాను. పాదానికి గుడ్డ పేలిక కట్టుకుని కుంటుకుంటూ ప్రయాణికుల్ని అడుక్కుంటోంది పాపమ్మ.

"ఏమైంది పెద్దమ్మా" అడిగాను.

"నువ్వా కొడకా. ఇనప మేకు గుచ్చుకుంది. అదే పోద్దిలే. కోడలు బాగుందా?" ప్రేమగా అడిగింది.

"కాలు సెప్టిక్ చేసుద్ది. ఆసుపత్రికి వెళ్దాం రా. ఇంజక్షన్ చేయించుకుందుగాని" అని తను వారిస్తున్నా బలవంతంగా డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాను. ఇంజక్షన్ ఇప్పించి, గాయానికి డ్రెస్సింగ్ చేయించి కట్టు కట్టించా. మళ్లీ కాళ్లకేమీ గుచ్చుకోకుండా వంద రూపాయలు పెట్టి ఒక చెప్పుల జత కొనిచ్చి, జాగ్రత్తగా వాడుకో" అని చెప్పాను.

"నా కడుపున పుట్టవైతివి కొడకా. నాకీ కష్టాలు ఉండేటివి కాదు. నీ కొడుకుల్ని, బిడ్డల్ని దేవుడు సల్లంగ జూస్తడు" అంది కృతజ్ఞతగా.

నేను బస్సెక్కి వెళ్లిపోయాను. మళ్లీ వారం దాకా కనపళ్లేదు. బహుశా ఊళ్లోకి వెళ్లి అడుక్కుంటుందేమో అనుకున్నాను. బస్టాండుకు రాగానే మాత్రం నా కళ్లు పాపమ్మ కోసం వెతికేవి. తను కనపడితే, పలకరిస్తే అదో తృప్తి నాకు. ఆరోజు మా జూనియర్ అసిస్టెంట్ బండి తెస్తానంటే వెయిట్ చేస్తూ బస్టాండులో నిలబడ్డా. కంట్రోలు రూం పక్కన బ్రహ్మచారి కొడుకు నాగలింగాచారి వాళ్ల నాయనమ్మతో ఏదో మాట్లాడుతున్నాడు. కొద్ది సేపటి తర్వాత తన బొడ్లో దోపుకున్న కొన్ని పదుల నోట్లు తీసి మనవడి చేతిలో పెట్టింది. తను వేసుకున్న చెప్పులు విడిచి ఇవ్వగానే అవి కాస్తా వేసుకుని పుస్తకాలు ఊపుకుంటూ కాలేజీ వైపు వెళ్లిపోయాడు ఆ అబ్బాయి.

ఆ దృశ్యాన్ని చూశాక నాకు కోపమొచ్చింది. 'కూడు పెట్టకుండా, ఊళ్లో కూడా నిలవనీయకుండా వెళ్లగొట్టినవాళ్లకు డబ్బు ఇస్తోందా? దగ్గరికెళ్లి "మనవడు వచ్చి పోతున్నట్లున్నాడు" అన్నాను కోపం పట్టలేక.

"అవును కొడకా. బెమ్మచారికి జెరమొస్తందంట. మందులకు కూడా డబ్బుల్లేవంట. నాకాడున్న మూడొందలు ఇచ్చిన. కొడుకు ఎట్లున్నడో ఏవో..." అంది కంట నీరు పెట్టుకుంటూ.

"చెప్పులెందుకిచ్చావ్. నీ కాళ్లకు రాళ్లు, ముళ్లు గుచ్చుకుంటాయి కదా" అన్నాను కాస్త అనుమానంగా.

"అంత మంచి చెప్పులు నా దగ్గరుండయి కొడకా. మొన్న రేతిరి తలాపు కింద పెట్టుకుని పడుకుంటే ముష్టోడు లాక్కుపోతుండు. నీ బోటి మారాజులు, వాడ్ని తిట్టి నాకిప్పించిండ్రు. ముండా కొడుకులు ఉండనియ్యరు. బెమ్మచారి కూడా ఒట్టి కాళ్లతోనే పనికి పోతుండంట. ఏసుకొమ్మని ఇచ్చిన. కొడుకు ఎట్లుండడో ఏవో... జెరమొస్తుందంట" దుఃఖం కట్టలు తెగినట్లు ఏడవసాగింది.

★

వికాసం

టైమ్ మేనేజ్‌మెంట్ ఎలా?

మన జీవితాలు ఎంతో బిజీ బిజీగా తయారైపోయాయి. ఒత్తిడి నడుమ ఎన్నో సమస్యలతో నలిగిపోతుంటాం. కళ్లెదుటే గడియారం వేగంగా తిరుగుతూ, దానిలో ముల్లు పరుగెడుతున్న భావన కలుగుతుంది. అందుకే సమయాన్ని ప్రతిభావంతంగా వినియోగించుకునే విధానాల గురించి తెలుసుకోవాల్సి ఉంది.

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

డబ్బుతో దేనినైనా కొనగలమేమోగానీ కాలాన్ని కొనుక్కోలేం. మనుషుల్లో టెన్షన్‌ని సృష్టించే ప్రధాన అంశం ఈ టైమ్. నియమిత కాలంలో అనేక అంశాలపై దృష్టి సారించాల్సి వస్తుంది. సమయం సరిపోదనే టెన్షన్.

ఎవరికైనా 'టైమ్' ఒకే రకంగా ఉంటుంది. ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ ఉండదు. అది అందరికీ స్థిరంగా ఉంటుంది. టైమ్‌కి ప్రత్యామ్నాయం మరొకటి లేదు. ఒకసారి సమయాన్ని వృథా చేసుకుంటే ఇక అది తిరిగి సంపాదించుకోలేం. ఉన్న టైమ్‌లో మనుషులు ఎన్నెన్నో పనులు చేయాల్సిన అవసరం చాలామందికి ఉంటోంది.

ఎలాంటి పదవిలో ఉన్నా ఎవరూ కాలాన్ని ఆపేయలేరు. దాని స్పీడును తగ్గించలేరు, పెంచలేరు. అంటే అది ఎవరి అదుపులోనూ ఉండదు. కొంతమంది తాము చేయాల్సిన పనుల ప్రాధాన్యతను నిర్ణయించుకుని ఆ ప్రకారం చేసుకుపోతుంటారు. మరికొంతమంది టైమ్ మేనేజ్‌మెంటు కోసం తమ సమయాన్ని వృథా చేసుకుంటున్నట్లు వాపోతుంటారు.

సమయం ఎందుకు వృథా అవుతుంది?

చాలామంది తమ సమయాన్ని ఎలా వృథా చేసుకుంటారో గమనించండి.

ఏ విషయంలోనూ నిర్ణయం తీసుకోలేరు. ఆలోచిస్తారు. ఆందోళన చెందుతారు. పక్కన ఉంచేస్తారు. మళ్లీ మళ్లీ ఆలోచిస్తారు. ఆందోళన చెందుతారు. ఆ విషయాన్ని పక్కన ఉంచేస్తారు. ఇదే సైకిల్ కొనసాగుతుంది. నిర్ణయం చేయలేరు.

సమస్యను అర్థం చేసుకుని విశ్లేషణ చేసుకోకుండా, ప్రణాళికా రహితంగా సమస్య మీదకు దాడికి వెళ్తారు. దానితో పెనుగులాట ప్రారంభిస్తారు.

ఏదో పని మొదలు పెట్టబోతుంటే ఎవరో వస్తారు. ఆ పని వాయిదా పడుతుంది. లేదా టెలిఫోన్ మోగడంతో దృష్టి మళ్లిపోతుంది.

చేయాల్సిన సమయంలో పనులు చేయకుండా వాయిదా వేసే పద్ధతి కాలాన్ని హరించివేస్తుంది.

నిముషాల్లో పని పూర్తైపోతుందని అనుకుంటారు. తీరా పని ప్రారంభించిన తర్వాత అది పూర్తికావడానికి చాలా సమయం తీసుకుంటుంది.

పని సరైన విధానంలో చేయడం తెలియక పొరపాట్లు చేస్తుంటారు. చేసిన పని మళ్లీ చేయడం వల్ల ఎక్కువ సమయాన్ని నష్టపోతుంటారు. అందుకే కంగారుగా పని పూర్తియేయడం గాక, మరికొంత ఎక్కువ సమయాన్ని తీసుకుని జాగ్రత్తగా పూర్తిచేయడం అలవరచుకోవాలి.

విపత్తు పరిస్థితులు ఎదురైనప్పుడు సరైన ప్రణాళికతో ముందుకు వెళ్తే విలువైన సమయం ఉపయోగపడుతుంది. అవగాహన లేకుండా పరుగులు తీస్తే సమయం వృథా అవుతుంది.

కార్యనిర్వహణ శక్తి లేకపోవడం వల్ల బోలెడంత సమయం వృథా అవుతుంది.

అనేక సమావేశాలు నిర్వహిస్తారు. ఎటువంటి నిర్ణయాలూ తీసుకోరు. ఫలితం శూన్యం. ఇటువంటి పనికిరాని సమావేశాలు సమయాన్ని మింగేస్తాయి.

ఇతరులకు పని అప్పగించరు. వారు ఎదిగిపోతారని భయం. ఇతరులకు అవకాశం ఇచ్చి పనిచేయించడం టైమ్ మేనేజ్‌మెంట్‌లో ఎంతో కీలకమైన విషయం.

ప్రాముఖ్యతను బట్టి పనులు చేసుకోవాలి. అర్జంటు అని వాటిని చేయకూడదు.

ప్రణాళిక వేసుకోకుండా పనులు నిర్వహించడం 'టైమ్' వేస్టు కావడానికి కారణమౌతుంది.

ఆదా చేసుకోవడం ఎలా?

♦ నిర్ణయం తీసుకునే పద్ధతిని జాగ్రత్తగా మేనేజ్ చేసుకోవాలి. నిర్ణయాలను మేనేజ్ చేసుకోవడం కాదు. ♦ ఒకే సమయంలో ఒకే అంశంపై దృష్టిని కేంద్రీకరించాలి. ♦ అనుదినం, తక్కువ కాలవ్యవధి, దీర్ఘకాలవ్యవధిలో చేయాల్సిన పనుల ప్రాధాన్యతను నిర్ణయించుకుని ఆ ప్రకారం చేయాలి. కరస్పాండెన్సు లెటర్ల వంటి వాటికి వెంట వెంటనే హాజరై అవసరాన్ని బట్టి జవాబులు ఇవ్వాలి. ♦ అవసరం లేని విషయాలను దూరంగా ఉంచాలి. ♦ పనిచేసే వ్యవస్థలో పని పూర్తిచేసే గడువులు చెప్పాలి. ♦ ఇతరుల సమయాన్ని వృథా చేయకూడదు. ♦ సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు వాటికి ఒక కారణం ఉండాలి. సమావేశం జరిగే సమయం హద్దులు నిర్ణయించుకోవాలి. ఈ సమావేశాల్లో అవసరమైన వారే హాజరు అయ్యేట్లు చూసుకోవాలి. ♦ బిజీ వర్కులో ఉండకుండా చూసుకోవాలి. ♦ ఖచ్చితంగా క్యాలెండర్‌లో ప్రధానమైన పనులను రాసుకుని ఆ ప్రణాళిక ప్రకారం వాటిని పూర్తి చేసుకోవాలి. ♦ ఒక పని, లేదా విధానం ఎప్పుడు ఆపెయ్యాలో స్పష్టంగా తెలిసి ఉండాలి. ♦ వీలయినంతవరకు ఉద్యోగులకు పనులు అప్పగించి వారిచేత ఆ పనులు చేయించే విధానం అలవరచుకోవాలి. ♦ విషయాలన్నింటినీ సూక్ష్మంగా, సరళంగా ఉంచాలి. ♦ అత్యంత ప్రముఖమైన విషయాలకు కొంత సమయం కేటాయించడం మరువకూడదు. ♦ చేయాలనుకున్న పనులు చేశారో, లేదో చెక్ లిస్టు చూసుకోవాలి. ♦ కొత్త పనులు మీదకు వచ్చినప్పుడు ప్రాముఖ్యతల లిస్టును సర్దుబాటు చేసుకోవాలి.

మరికొన్ని టెక్నిక్స్

♦ పని ప్రారంభించాలనుకున్న వెంటనే ప్రణాళిక తయారు చేసుకుని మొదలు పెట్టాలి.

♦ రొటీన్‌గా చేయకుండా కొంచెం సృజనాత్మకతతో ఆలోచిస్తే పని తొందరగా పూర్తవుతుంది.

♦ చేయలేని పనులను 'నిరాకరించడం' నేర్చుకోవాలి. ప్రతి విషయాన్ని అంగీకరించి ధనాన్ని, సమయాన్ని వృథా చేసుకోకూడదు.

♦ పెద్ద పనులను చిన్న చిన్నవిగా విభజించుకుని పూర్తి చేయడం అలవరచుకోవాలి.

♦ ఏ పని పూర్తి చేయడానికైనా అనవసరపు శ్రమ పడకూడదు.

♦ ఏ విషయం గురించైనా ఒకేసారి చర్చించి, తుది నిర్ణయం తీసుకోవాలి.

♦ పని ఎప్పుడు ప్రారంభించాలి? ఎప్పటికి పూర్తి చేయాలి? అనే విషయంలో స్పష్టత కల్గి ఉండాలి.

♦ వివేకంతో ప్రణాళికలు రూపొందించుకుని ఆ ప్రకారం పనులు పూర్తయ్యేలా చూసుకోవాలి.

★

పడమటికొండలు నునుపు..!



'**దూ**రపు కొండలు నునుపు' అని సామెత ఉండేది. ఈ నవల చదివాక దాన్ని 'పడమంటి కొండలు నునుపు' అని మార్చాలనిపిస్తుంది. ఇటీవల అరబ్బు దేశాలకు జీవనోపాధి కోసం వెళ్లిన వారి కన్నీటి కథనాలే అందరికి తెలుసు. ఈ నవల చదివాక.. ఇందులో అమెరికా తక్కువేం కాదనిపిస్తుంది. అమెరికా భ్రమల్లో ఉన్నవారికి ఆ తెరలు తొలగిపోతాయి. అలాగే అక్కడికెళ్లాలన్న మోజు తగ్గుతుంది. 'భూతల స్వర్గం... అక్కడంతా ఆహ్లాదమూ.. ఆనందమే..' అనుకునే వారి కళ్లు తెరుచుకుంటాయి. 'సూటూ బూటూ వేసుకుని పొడుగాటి కార్లలో రోడ్లపై రయ్యిమంటూ తిరగడమే..' వంటి అంచనాలు పటాపంచలవుతాయి. అమెరికాలో పేదలే ఉండరని ఊదరగొట్టే వారికి ఈ నవల ఓ చెంపపెట్టు. ప్రస్తుత పరిస్థితుల్లో రచయిత డా॥ ఎస్.శంకరయ్య 'పడమటి కొండలు' నవల రాసి సాహసించారనే చెప్పాలి. అమెరికా నిజ స్వరూపాన్ని మన కళ్లముందుంచారు. మామూలు మధ్యతరగతి కుటుంబాల్లో మెడిసిన్ చదవడం ఎంత కష్టమో తెలియంది కాదు. ఓ సామాన్య యువకుడైన వెంకటసాయి మెడిసిన్ పూర్తి చేసి వైద్యుడవుతాడు. హైదరాబాద్‌లో అప్పుల పాలై, ఎన్నో ఆశలతో తన బ్రహ్మచారి స్నేహితునితో కలిసి నాటకీయంగా న్యూయార్క్ పయనమవుతాడు. ఈ సందర్భంగా వీసాలు ఎంత వీజీగా దొరుకుతున్నాయో కూడా చెప్పకనే చెప్పారు రచయిత. వెంకట్ బాగా సంపాదించి, తన భార్యాబిడ్డలతో ఉన్నతమైన జీవితాన్ని అనుభవించాలని ఎన్నో కలలు కంటాడు. అవన్నీ కల్లలే అని.. అక్కడకు వెళ్లింది మొదలు అడుగడుగునా అతనికి బోధపడుతుంది. వెంకట్ పడే కష్టాలు చూస్తుంటే మనకూ జాలేస్తుంది.. 'అక్కడకు అసలెందుకు వెళ్లాలి?' అని కోపం కూడా తెప్పిస్తుంది. న్యూయార్క్‌లో హింస గురించి, చిన్న చిన్న పనుల కోసం పడే ఆరాటం గురించి, హోటళ్లలో టిప్పుల గురించి, టిప్‌టాప్ జీవితాల గురించి రచయిత వర్ణించారు. అమెరికాలోని చీకటి కోణాలు తెలుసుకోవాలనే వారికి ఇదో దిక్సూచి. ఈ రచన చేయాలన్న రచయిత సంకల్పం ఆయనలోని సుగుణాన్ని వెల్లడిస్తుంది. అందుకే 'పడమటికొండలు' నవలకు పోటీల్లో ప్రథమ బహుమతి (లక్షరూపాయలు) లభించింది. ఇటువంటి రచనలు మరిన్ని వెలుగు చూడాలి.

పడమటి కొండలు, డా॥ఎస్.శంకరయ్య, పేజీలు 286, వెల : రూ. 13౦,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్.

- శాంతిశ్రీ

కొత్త పుస్తకాలు

బడుగుజీవుల 'బతుకు సేద్యం'

కథల్లో కాలక్షేపానికి చదివి మరిచిపోయేవి కొన్ని. మనసు పొరలు తడిమి మరల మరలా గుర్తొచ్చేవి కొన్ని. మూలాలను గుర్తుచేయడమే రెండో తరహా కథల ప్రత్యేకత. జ్ఞాపకాలను వెలికి లాగడంవల్లనే ఆ కథలకు అంతటి ప్రాధాన్యత. అలాంటి కథలను విరచించి, అందించిన సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి అభినందనీయుడు. ఆయన రచించిన 'బతుకు సేద్యం' కథాసంపుటి ఆషామాషీగా రాసింది కాదు. అనుభవించి, కనులారా కాంచి రాసినది. అందుకే ఆ కథల్లో ఆ ఆవేదన, అంతటి ఆర్తి. నిజానికివి కథలు కావు, గ్రామసీమల్లో మాత్రమే కనిపించే వాస్తవ వర్ణచిత్రాలు. రైతు మదిలో సుడిరేగే ఆలోచనల సంగమాలు. పల్లె హృదయాలకే పరిమితమైన చిక్కని అనుభూతుల సంగీతాలు. ఆ భాషలోని యాస పాఠకులకు కొంగొత్త లోకాలను రుచిచూపిస్తుంది. ఈ కథలను అర్థంచేసుకోవడం చాలా సులువు... కాకుంటే నిజాలు మింగుడుపడటమే కాస్త కష్టం. ఇందులోని 'మువ్వలు రాలిన పాట' కథ చదువుతుంటే గుండె గొంతుకలో కొట్టుకులాడిన అనుభూతి. పోటీప్రపంచంలో వసివాడుతున్న పసిమొగ్గల ఆర్తనాదం 'సారీ... సారీ... లిటిల్‌స్టార్'. ప్రకృతిలో జాతులు ఒకరిపై మరొకరు ఆధారపడి జీవించి సాధించే సమన్వయాన్ని... దాని ఆవశ్యకతను 'పిట్టపాట' చెబుతుంది. జీవితంలో కష్టాలు, కన్నీళ్లు ఎదురైనా కాలంతోపాటు ముందుకుపోగల మనోనిబ్బరం అతివల సొంతమని 'అరలు అరలు' నిరూపిస్తుంది. నాగరిక ముసుగుమాటున బతికే ఆధునిక బంధాలను 'సెగ లోగిలి' ఎత్తి చూపుతుంది. నీటిలోని చేప నీటిలోనే ఈదగలదు. నేలమీద నడవమంటే... కాదూ గాలిలో ఎగరమంటే? 'ఆమె మొలకెత్తిన నేల' కథలో ఇందిరా అంతే! 'బతుకు సేద్యం' కథలోని క్రిష్ణ, ఎగిరే సీతాకోకచిలుక, పాడే కోయిల, దూకే జలపాతం... వీటిని ఆపాలని ప్రయత్నిస్తే ఏమవుతుందో, స్వేచ్ఛగా వదిలేస్తే ఏమవుతుందో చెప్పిన పద్ధతి అసామాన్యం. అమ్మదనపు కమ్మదనం ముందు చిన్నబోయిన కన్నకొడుకుల వైనం 'అమ్మ' కథను మరవడం కష్టమే! రైతు కష్టాన్ని సులువుగా జేబులో వేసుకునే భూస్వాముల కథ 'సుడిగాలి', పచ్చని పల్లెసీమలను పగలసీమలుగా మార్చే కుల రాజకీయాలకు దర్పణం 'బురద'. చిరిగిన చొక్కాలోంచి కనపడే రైతు బతుకు చిత్రం 'బతుకు సేద్యం'. మట్టిపైన, పంటపైన, చుట్టూ జీవజాలంపైనా రైతుమారాజుకుండే అవాజ్యమైన అనురాగం మరే రారాజుకూ సాధ్యం కాని పని! మట్టిని నమ్ముకుని బతికే వానికీ, మట్టిని అమ్ముకుని బతికే వాడికీ మధ్యగల తేడా అది! దాన్ని స్పష్టంగా చూపించిన కథా సంపుటి ఇది.

'బతుకు సేద్యం' కథలు, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, పేజీలు: 120, వెల: 60/-,
ప్రతులకు: ప్రగతి పబ్లికేషన్స్.

- కె. అరుణ



మీరు
చదువుకుంటున్నది
ఎందుకోసం?
జె.కృష్ణమూర్తి
పేజీలు: 88, వెల: 60/-,
ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
అన్ని బ్రాంచీలు

కవిరాజు సాహిత్యం - 2
భగవద్గీత
కవిరాజు త్రిపురనేని రామస్వామి
పేజీలు: 422, వెల: 200/-,
ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, విజ్ఞాన్ భవన్, అబిడ్స్,
హైదరాబాద్.
అన్ని బ్రాంచీలు



ఆ ఒక్కటి ఏది?

బుజ్జాయిలూ... కింద చాలా రకాల వస్తువుల బొమ్మలున్నాయి. అవి మనకు ఎన్నో రకాలుగా ఉపయోగపడతాయి. ఇక్కడున్నవన్నీ జతగా ఉన్నాయి. అంటే ఒక్కో వస్తువు రెండేసి చొప్పున ఉన్నాయి. కానీ ఒక్కటి మాత్రం దాని జత లేకుండా ఒక్కటే ఉంది. అయితే ఆ ఒక్క వస్తువు ఏదో కనిపెట్టండి.



క్విజ్ మాస్టర్

1. బాలల దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటాం?
2. బాలల దినోత్సవం సందర్భంగా ఎవరి జయంతి జరుపుకుంటాం?
3. జవహర్‌లాల్ నెహ్రూ కుమార్తె ఎవరు?
4. నెహ్రూ మన దేశానికి ఎప్పటి నుండి ప్రధానమంత్రి.
5. మన దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చింది?

- ఆర్. పంచారామ్,
పదవతరగతి, ఊటపల్లి.

జవాబులు: 1. నవంబర్ 14, 2. జవహర్‌లాల్ నెహ్రూ, 3. ఇందిరాగాంధీ, 4. 1947 ఆగస్టు 15 నుండి, 5. ఆగస్టు 15, 1947.

మీరూ ఇలా 5 ప్రశ్నలు, జవాబులు రాసి పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా : క్విజ్ మాస్టర్, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.

ఎన్ని ముఖాలు

ఫ్రెండ్స్! మనం రోజూ వాడే పెన్సిల్‌కి ఎన్ని భుజాలున్నాయో చెప్పండి. కొంచెం ఆలోచించి చెప్పండే.

మూడు తాళాలు

ముగ్గురు స్నేహితులు కలిసి ఒక సైకిల్ కొన్నారు. ముగ్గురికీ వీలుగా ఉండేట్లు మూడు తాళాలు వేశారు. ఎవరి తాళంచెవి వారి దగ్గరే ఉంచుకున్నారు. ఎవరికి కావాలన్నా మిగిలిన ఇద్దరు రాకుండానే తాళం తీసేట్లు మూడు తాళాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ తాళాలు ఎలా వేస్తే ఎవరికి వారే మరో ఇద్దరితో పని లేకుండా తాళం తీసి సైకిల్ వాడుకోవచ్చు.!



పప్పీ ఎక్కడ?

పింకీ, చిన్నూ ఆడుకోడానికి పప్పీని తెచ్చుకున్నారు. కానీ అది తప్పించుకుని వెళ్లి అక్కడే దాక్కుంది. ఎంత వెతికినా వాళ్లకి కనిపించడం లేదు. మీకు కనిపిస్తే ఎక్కడుందో చేప్తారా?

సుడోకు నింపేద్దాం

నేస్తాలూ.. ఇక్కడ ఓ పెద్ద బాక్సు, అందులో తొమ్మిది చిన్న చిన్న బాక్సులు ఇచ్చాం. వాటిలో మళ్లీ తొమ్మిది గళ్లు ఉన్నాయి. కొన్ని గళ్లలో అంకెలు కూడా వున్నాయి. మీరేం చేయాలంటే చిన్న బాక్సుల్లో 1 నుండి 9 వరకు అంకెలు వేయాలి. వేసిన అంకె మళ్లీ వేయకూడదు. అలా తొమ్మిది చిన్న బాక్సులు నింపేయాలి. సరేనా...

1		9	8		5			
			1			3		
	4	7			2			1
						2		6
		3		4		8		
4		2						
8			7			1	2	
		1			9			
			6		1	5		9

తలకిందులుగా వేలాడే పక్షి

ఈవారం అయోరా పక్షుల గురించి తెలుసుకుందాం. ఇవి నిగనిగలాడే నలుపు రంగులో పిచ్చుకంత ఉంటాయి. శరీరం కింది భాగం పసుపు పచ్చ రంగులో మెరిసిపోతుంది. రెక్కల మీద రెండు తెల్లని అడ్డగీతలుంటాయి. తోక నలుపు రంగులో ఉంటుంది. ఇవి చెట్టమీదే ఎక్కువగా కనిపిస్తాయి. చెట్టమీద ఒక కొమ్మమీద నుండి మరొక కొమ్మమీదికి ఎగురుతుంటాయి. అలా ఎగిరేటప్పుడు కనిపించిన కీటకాలను, ఆకు పురుగులను కొమ్మల మీద తలకిందులుగా వేలాడుతూ తింటాయి. ఇవి ఎప్పుడూ జంటగానే తిరుగుతుంటాయి. ఈ జంటలో ఒకదాని గురించి మరొకటి తెలుసుకోడానికి ఈల వేసుకుంటాయి. ఈ పక్షులు జత కట్టేముందు మగ పక్షి చాలా ఆకర్షణీయంగా తయారవుతుంది. ఇవి గూళ్లను చాలా శుభ్రంగా ఉంచుకుంటాయి. అంతేకాదు వాటి పిల్లలకు గూడు మెత్తగా ఉండడానికి మెత్తటి గడ్డిపోచలను, వేళ్ల నారలను మందంగా ఏర్పాటు చేస్తాయి. గూడు అందంగా ఉండడానికి దాని చుట్టూ సాలె పట్టును అతికిస్తాయి. వీటి గుడ్లు లేత గులాబీ రంగులో ఉంటాయి. వీటిలోనే మార్షల్ అయోరా అనే మరో జాతి ఉంది. ఈ పక్షులకు తోక చివరి భాగం తెల్లగా ఉంటుంది. ఇవి పశ్చిమబెంగాల్, రాజసాన్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కువగా కనిపిస్తాయి.



నేర్చుకుందామా...



ఎలా చేయాలి?

ఫ్రెండ్స్... పక్క బాక్సులలోని గళ్లలో కొన్ని అంకెలు, గుర్తులు ఉన్నాయి. ఖాళీ గళ్లలో ఏ అంకెలు వేస్తే కింది వరుసలో, కుడివైపు చివరి వరుసలో వేసిన మొత్తం వస్తుందో చెప్పండి.

	X		+		11
-	■	-	■	+	
	+		+		15
X	■	-	■	-	
	-		X		-47
-54		-4		-4	

జవాబులు

మూడు తాళాలు :



ఎన్ని ముఖాలు : పెన్సిల్ షడ్భుజాకారంలో ఉంటుంది. కానీ రెండు చివర్లు కలిపి మొత్తం ఎనిమిది ముఖాలు ఉంటాయి.

పప్పీ ఎక్కడ? : చెట్టు కొమ్మల్లో దాక్కుంది.

ఎలా చేయాలి? :

2	X	5	+	1	11
-	■	-	■	+	
8	+	3	+	4	15
X	■	-	■	-	
7	-	8	X	5	-47
-54		-4		-4	

సుడోకు:

1	3	9	8	7	5	4	6	2
6	2	8	1	9	4	3	5	7
5	4	7	3	6	2	9	8	1
7	1	5	9	3	8	2	4	6
9	6	3	2	4	7	8	1	5
4	8	2	5	1	6	7	9	3
8	9	6	7	5	3	1	2	4
3	5	1	4	2	9	6	7	8
2	7	4	6	8	1	5	3	9

మాటల కోట - 58

రూపకల్పన: కర్లపాలెం

1		2		3	4			5
							6	
		7		8		9		
10	11			12				
13							14	15
		16					17	
	18			19		20		
21			22					23
		24				25		

అడ్డం :

1. సత్యమేవ ...... (3)
3. బొట్టు. పాతకాలం నాటి గాయని కూడా (3)
6. జలుబు (2)
7. తెలుగు వారి హ్యాండ్ కర్చీఫ్ (3)
9. జయప్రకాష్ నారాయణ్ - సంక్షిప్తంగా (2)
10. అల్లరి (2)
12. చెడుగుడు (3)
13. నత్తి (2)
14. 'మావిడాకు'లో ముందు సగం మీది కాదు (2)
16. అంబ, అంబాలిక మధ్య బాలిక (3)
17. ఒప్పుకానిది (2)
18. రోట్లో రోకలితో ..... (2)
19. లబ్ధావధానుల లక్షణము (3)
21. ... అప్పుడు (2)
24. గరళ కంఠుడి కంఠంలో ఉండే విషం (3)
25. కన్యాశుల్కము - కామెడీ విలన్ ((3)

నిలువు :

1. నీరాజనంలోని ప్రజలు (2)
2. మన 'చాయ్' (3)
4. భారతంలోని 'లాక్షగృహ' దీనితో కట్టబడిందని కథనం (2)
5. ఇంటిలోనే కాదు... కంటిలో కూడా కనపడేది (2)
6. బురద (2)
8. పురుగుల పరుగులు (5)
9. బొంబాయి ప్రియుడు హీరో ఇంటిపేరు (2)
11. .....గోవుపాలు గరిటెడైనను చాలు అని వేమన వాదం (2)
14. మాతాపితలలో ముందు వందనీయురాలు (2)
15. అసెంబ్లీలో ఓటింగ్ వేళ ప్రజాప్రతినిధులకు కచ్చితంగా తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేయాలని జారీ చేసే ఆదేశం (2)
16. చివర (2)
18. గుంపు (2)
20. ఒక రకమైన కాయగూర (3)
21. నీరుపోసేవాడు ..... పోస్తాడని సామెత (2)
22. తారాశశాంక కథానాయిక (2)
23. కుటుంబ పరంపర (2)

మాటలకోట - 57 జవాబు

	1 వి	2 నో	దం		3 కా	4 వే	రి	
5 కొ		రు		6 ఆ		దం		7 భా
8 స	9 దా		10 గాం	ధా	రం		11 జౌ	ను
12 రా	యి			ర్			13 రా	మ
జు		14 ప	ద్యం		15 కా	16 సు		తి
	17 మి	న్న		18 సం		19 మం	20 చు	
21 ఉ	ట్టి		22 రాం	దే	వ్		23 క్క	24 కు
ష్ప		25 పో		శం		26 ము		ప్ప
	27 కు	క	వి		28 మా	ర	న్	

సాలెపురుగు తెలివి



అనగనగా ఓ అడవి. ఆ అడవిలో ఒక సాలెపురుగు. దానికి డబ్బు చాలా అవసరం. కానీ చిల్లిగవ్వ కూడా దాని దగ్గర లేదు. అందుకని ఒక ఉపాయం ఆలోచించింది.

పిల్లి దగ్గరికి వెళ్లి వంద రూపాయలు అప్పు అడిగింది.

అప్పుడు పిల్లి "వంద రూపాయలు ఇస్తాను కానీ నాకు త్వరగా తిరిగి ఇచ్చేయాలి మరి" అంది.

"వచ్చే మంగళవారం సరిగ్గా పది గంటలకు మా ఇంటికి వస్తే, నీ బాకీ తీర్చేస్తా" అని చెప్పింది సాలెపురుగు.

ఆ తర్వాత కుక్క దగ్గరికి వెళ్లి "రెండు వందల రూపాయలు అప్పు ఇస్తావా? చాలా అవసరం పడింది" అని అడిగింది.

"ఎప్పుడు తిరిగి ఇస్తావు?" అంది కుక్క.

"వచ్చే మంగళవారం సరిగ్గా పది గంటల పది నిమిషాలకు మా ఇంటికి రా. నీ బాకీ తీర్చేస్తా" అంది.

అక్కడ్నుండి తోడేలు దగ్గరికి వెళ్లింది. దాన్నడిగి మూడు వందల రూపాయలు అప్పు తీసుకుంది.

"వచ్చే మంగళవారం సరిగ్గా ఉదయం పది గంటల ఇరవై నిమిషాలకు మా ఇంటిరా. నీ డబ్బు అణా పైసలతో సహా తిరిగి ఇస్తా" అంది.

అలాగే చిరుత పులి దగ్గరికి వెళ్లి నాలుగు వందల రూపాయలు అప్పు కావాలని అడిగింది.

"త్వరగా నా డబ్బు తిరిగి ఇచ్చేస్తానంటేనే ఇస్తా" అంది చిరుత.

"వచ్చే మంగళవారం సరిగ్గా పది గంటల ముప్పై నిమిషాలకు మా ఇంటికి రా. నీ బాకీ తీరుస్తాను" అని చెప్పింది సాలెపురుగు.

అలా ఆ నలుగురు దగ్గర వెయ్యి రూపాయలు సంపాదించింది. ఆ డబ్బుతో ఒక వ్యాపారం ప్రారంభించింది.

మంగళవారం వచ్చేసింది. పిల్లి సరిగ్గా పది గంటలకు సాలెపురుగు ఇంటి దగ్గరికి వచ్చేసి తలుపు కొట్టింది. సాలెపురుగు పిల్లిని సాదరంగా ఆహ్వానించింది. దానికి వేడి వేడి టీ తయారు చేసిచ్చింది. పిల్లి టీ తాగుతోంది. అంతలోనే కుక్క వచ్చి తలుపు కొట్టింది.

అప్పుడు సాలెపురుగు "అమ్మో! కుక్క వచ్చినట్లుంది. నువ్వెళ్లి ఆ పరదా చాటున దాక్కో" అని పిల్లికి చెప్పింది.

కుక్కంటే భయపడే పిల్లి సాలెపురుగు చెప్పినట్లే వెళ్లి పరదా వెనక దాక్కుంది.

తర్వాత సాలెపురుగు వెళ్లి తలుపు తీసింది. కుక్క లోపలికి వచ్చి "నా డబ్బులిచ్చెయ్. నేను త్వరగా వెళ్లాలి" అంది.

సాలె పురుగు "నీ డబ్బు పువ్వుల్లో పెట్టి ఇస్తాను. ముందు ఈ టీ తాగు" అని పొగలు కక్కుతున్న టీ కప్పు కుక్క చేతికిచ్చింది. అది టీ తాగుతుండగానే తోడేలు వచ్చి తలుపు కొట్టింది.

సాలెపురుగు "అమ్మో! తోడేలు వచ్చింది. నువ్వెళ్లి ఆ పరదా చాటున దాక్కో" అంది. కుక్కకి తోడేలు అంటే చాలా భయం. అందుకే సాలెపురుగు చెప్పినట్లే వెళ్లి దాకుంది. అక్కడున్న పిల్లిని చూసి చప్పుడు కాకుండా దాన్ని చంపి మింగేసింది.

తోడేలు లోపలికి వచ్చింది. సాలెపురుగు మళ్లీ టీ చేసి దానికి ఇచ్చింది. అది టీ తాగుతోంది. అప్పుడే చిరుతపులి వచ్చి తలుపు కొట్టింది.

మళ్లీ సాలెపురుగు "అయ్యో! చిరుతపులి వచ్చినట్లుందే! అది నిన్ను చూస్తే చాలా ప్రమాదం. నువ్వెళ్లి లోపల దాక్కో" అని చెప్పింది. చిరుత పులి అంటే భయపడ్డ తోడేలు సాలెపురుగు చెప్పినట్లే పరదా చాటుకెళ్లి దాక్కుంది. అప్పటికే అక్కడ దాక్కున్న కుక్కను చూసింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా దాన్ని చంపి తింటోంది. తోడేలు కుక్కను పూర్తిగా తినకముందే చిరుతపులి లోపలికి వచ్చి ఈ దృశ్యాన్ని చూసింది.

వెంటనే తోడేలు మీదకి లంఘించింది చిరుత. ఆ రెండు చాలా సేపు కొట్లాడుకున్నాయి. ఈ లోపు సాలెపురుగు ఒక బక్కెట్ నిండా సలసల కాగే నీళ్లు తెచ్చి ఆ రెండింటి మీద పోసింది. దెబ్బకు రెండూ చచ్చాయి.

'ఇప్పుడు నేను ఎవరికీ బాకీ తీర్చే పనిలేదు' అని బోలెడు ఆనందపడిపోయింది సాలెపురుగు.

- మేకల మదన్‌మోహన్‌రావు



పత్రచిత్రాలు

ఆకులో ఆకునై...పువ్వులో పువ్వునై...కొమ్మలో కొమ్మనై...నును లేత రెమ్మనై...ఈ అడవి దాగిపోనా...ఎటులైనా ఇచటనే ఆగిపోనా...

'మేఘసందేశం' కోసం వేటూరివారు రాసిన పాట గుర్తొస్తోంది కదూ ఈ పత్ర చిత్రాలను చూస్తుంటే! ఆకులు, పూలు, కొమ్మలు, రెమ్మలు ఎంత ఒద్దిగ్గా రకరకాల ఆకారాల్లో ఇమిడిపోయాయో! అయినా కళాఖండాలు సృష్టించడానికి చిత్రకారుడికి ఖరీదైన కాన్వాసులు, రంగులే కావాలా! అడవిలో వదిలిపెట్టినా రాలిపోయిన ఆకులు, పూలు, కాడలు సేకరించి తన సృజనాత్మక ప్రపంచాన్ని ఆవిష్కరించేస్తాడు! అలా ఎందరో కళాకారులు తయారుచేసిన పత్ర చిత్రాలే మీ ముందుకొచ్చి నిలబడ్డాయి. మరి చూసి ఆస్వాదిస్తారో! ఆదమరచి చిత్తరువులవుతారో మీ ఇష్టం!!